వార్తా పత్రికలు,
అధిక సంఖ్యలో పుస్తకముల ముద్రణ కోసం సంప్రదించండి.
9393949345.
విశాఖ సమాచారమ్ ప్రెస్
మల్టీకలర్ వెబ్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM

Postal License No. VSP / 96/ 2021 - 23
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

విలేకరులు కావలెను
విశాఖ సమాచారమ్
తెలుగు దినపత్రికకు దిగువ తెలిపిన ప్రాంతములలో విలేకరులు కావలెను.
గాజువాక, పాయకరావుపేట, కోటవురట్ల, నర్సీపట్నం, అడ్డురోడ్డు, తాళ్లపాలెం, పాడేరు, ఎస్.కోట, కొత్తవలస, పెందుర్తి, ఆనందపురం, తగరపువలస, విజయనగరం, శ్రీకాకుళం రూరల్.
సంప్రదించండి : 9393949345, 7013785256

RNI No.52722/90 సంపుటి : 33 సంచిక : 145 విశాఖపట్నం, 18 మార్చి 2023 శనివారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

## రైల్వే అండర్ బ్రిడ్జిల కోసం కేంద్ర మంత్రికి సత్యవతి వినతి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ని అనకాపల్లి పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బి.వి సత్యవతి న్యూఢిల్లీలో మంత్రి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు.ఈ సందర్భంగా ఎంపి సత్యవతి రైల్వే మంత్రి కీతన పార్లమెంటరీ నియోజకవర్గం అనకాపల్లి లో మూలపేట - నుండి సత్యనారాయణపురం వద్దగల రైల్వే లెవెల్ క్రాసింగ్ దగ్గర రైల్వే అండర్ బ్రిడ్జ్ అలాగే లంకెలపాలెం రైల్వే లెవెల్ క్రాస్ దగ్గర రైల్వేఅండర్ బ్రిడ్జిల ను నిర్మించాలని ఎన్నో ఏళ్లుగా ప్రతిపాదనలు పంపడం జరుగుతుందని , ఇటీవలే రైల్వే శాఖ వారు జీవో ని విడుదల చేశారని అందులో పూర్తిగా రైల్వే నిధులతో రైల్వే అండర్ బ్రిడ్జిలు నిర్మిస్తారని,అందులో భాగంగా పైన పేర్కొన్న రెండు రైల్వే అండర్ బ్రిడ్జి ల ను కేంద్ర ప్రభుత్వ యొక్క సహకారంతో నిర్మించాలని కోరడం జరిగినది. అదేవిధంగా అమృత భారత్ పథకం కింద అనకాపల్లి రైల్వే స్టేషన్ ను ఎన్నుకున్నందుకు రైల్వే మంత్రి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఇప్పటికే మంజూరు చేసిన సౌత్ కోస్ట్ జోన్ పనులను పూర్తిచేయాలని రైల్వే మంత్రికి లేఖ ద్వారా ఎంపీ తెలియజేశారు.

## ఉత్కంఠ భరితంగా ఎమ్మెల్సీ ఫలితాలు

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** గురువారం ఉదయం మొదలైన ఉత్తరాంధ్ర జిల్లాల పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల ఓట్ల లెక్కింపు కార్యక్రమం ఉత్కంఠ భరితంగా కొనసాగింది. అమిత విశ్వాసంతో అత్యధికంగా ప్రచారం చేసిన వైకాపా అభ్యర్థి సీతంరాజు సుధాకర్ మొదటి రౌండ్ నుండి ఎనిమిదవ రౌండ్ వరకు వెనుకబడే ఉన్నారు. మొత్తం 2,13,035 ఓట్లు పోలింగ్ అవగా 12,318 ఓట్లు చెల్లలేదు. లెక్కించబడిన ఓట్లు 1,89,017 కాగా 94,509 ఓట్లు సాధించిన వారు గెలిచినట్లుగా ప్రకటించబడతారు. అయితే అత్యధికంగా టీడీపీ అభ్యర్థి చిరంజీవికి 82,958 మొదటి ప్రాధాన్యత ఓట్లు లభించగా 11,551 ఓట్లు ద్వితీయ ప్రాధాన్యత నుండి పొందవలసి ఉంది. బహుశా అర్ధరాత్రికి ఆయన ఆ ఓట్లు సాధించే అవకాశం ఉంది. ఇక అధికార వైకాపా అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు 55,749 ఓట్లు రాగా పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు 35,148 ఓట్లు లభించాయి. బీజేపీ పార్టీ తరపున సిట్టింగ్ ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్ 10,884 ఓట్లు రాగా ఆయనకు డిపాజిట్ దక్కలేదు. అయితే ఎన్నికల ఫలితాలపై హైకోర్టు స్టే విధించిన కారణంగా విజేతను ప్రకటించడం ఇంకా జరగదు.

# ఢిల్లీలో సీఎం జగన్ సుడిగాలి పర్యటన

**న్యూఢిల్లీ :** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీ పర్యటన ముగిసింది. సీఎం జగన్ ఢిల్లీ పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షాలతో సమావేశ మయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన కీలక అంశాలపై ప్రధాని మోదీ, మంత్రి అమిత్ షాలతో సీఎం జగన్ చర్చించారు.

**కేంద్ర మంత్రి అమిత్ షాతో ముగిసిన సీఎం జగన్ భేటీ :** కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షాతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి భేటీ ముగిసింది. సీఎం జగన్ ఢిల్లీ పర్యటనలో భాగంగా ఈరోజు మధ్యాహ్నం(శుక్రవారం) అమిత్ షాతో సీఎం జగన్ భేటీ అయ్యారు. అమిత్ షాతో జరిగిన సమావేశంలో రాష్ట్రానికి సంబంధించిన కీలక అంశాలపై చర్చించినట్టుగా తెలుస్తోంది.

**ప్రధానితో సీఎం జగన్ భేటీ:** ప్రధాని నరేంద్ర మోదీతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం భేటీ అయ్యారు. పార్లమెంటులోని ప్రధాన మంత్రి కార్యాలయంలో సమావేశమైన సీఎం.. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై ప్రధానితో చర్చించారు. ఈ మేరకు సీఎం విజ్ఞాపన పత్రం అందించారు.



**ప్రధానితో సీఎం ప్రస్తావించిన అంశాలు:**

రాష్ట్ర విభజన జరిగి 9 సంవత్సరాలు కావొస్తోంది. ఇప్పటివరకూ రాష్ట్రానికి నెరవేర్చాల్సిన అనేక అంశాలు ఇంకా పెండింగులోనే ఉన్నాయి. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించిన చాలా ద్వైపాక్షిక అంశాలు పరిష్కారానికి నోచుకోలేదు. వీటిపై వెంటనే దృష్టిసారించమని కోరుతున్నాను.

గతంలో నేను ప్రస్తావించిన ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పేర్కొన్న అంశాలపై కేంద్రం ఆర్థికశాఖ కార్యదర్శి నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఇప్పటికే పలు దఫాలుగా చర్చలు జరిపి కొంత పురోగతి సాధించింది. కీలక అంశాలన్నీ ఇంకా పెండింగులోనే ఉన్నాయన్న విషయాన్ని మీ దృష్టికి తీసుకొస్తున్నాను.

2014-15 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రిసోర్స్ గ్యాప్ ఫండింగ్ కింద రూ.36,625 కోట్ల రూపాయలు పెండింగులో ఉన్నాయి. రీసోర్స్ గ్యాప్ ఫండింగ్ చేస్తామంటూ పార్లమెంటు సాక్షిగా కేంద్రం ప్రభుత్వం చెప్పింది. ఈ నిధులను వెంటనే విడుదలచేయాల్సిందిగా, సంబంధిత శాఖలకు తగిన ఆదేశాలు ఇవ్వాల్సిందిగా కోరుతున్నాను.

గతంలో ఉన్న ప్రభుత్వం పరిమితికి మించి రుణాలు వాడిందన్న కారణంతో ఇప్పుడు రాష్ట్ర రుణాల పరిమితులపై ఆంక్షలు విధించారు. ఈ ప్రభుత్వం తప్పు లేకపోయినప్పటికీ నిబంధనలు ప్రకారం ఇచ్చిన రుణ పరిమితిని కూడా తగ్గించారు. 2021-22లో రూ.42,472 కోట్ల రుణపరిమితి కల్పించి, తదుపరి కాలంలో రూ.17,923 కోట్లు తగ్గించారు. కోవిడ్ మహమ్మారి సృష్టించిన ఆర్థిక విపత్తు సమయంలో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ విషయంలో జోక్యం చేసుకుని సానుకూల నిర్ణయం తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను.

పోలవరం ప్రాజెక్టు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత సంకల్పంతో ముందుకు సాగుతోంది. ఆంధ్రప్రదేశ్ ప్రజల చిరకాల వాంఛను నెరవేర్చే దిశగా ప్రాజెక్టు నిర్మాణాన్ని సాగిస్తోంది. ఈ ప్రాజెక్టు విషయలో కేంద్రం ప్రభుత్వం తగిన సహకారం అందిస్తే కొద్దికాలంలోనే ఇది వాస్తవ రూపంలోకి వస్తుంది. ఫలితాలు ప్రజలకు అందుతాయి. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం తాను సొంతంగా సొంత ఖజానానుంచి రూ. 2600.74 కోట్ల రూపాయలు ఖర్చు చేసింది. గడచిన రెండు సంవత్సరాలుగా ఇవి పెండింగ్‌లో ఉన్నాయి. ఈ బకాయిలను వెంటనే చెల్లించాల్సిందిగా తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరుతున్నాను.

పోలవరం ప్రాజెక్టు అంచనాలను టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ రూ. 55,548 కోట్లుగా నిర్ధారించింది. వెంటనే దీనికి ఆమోదం తెలపాల్సిందిగా కోరుతున్నారు.

తాగునీటి సరఫరా అంశాన్నికూడా పోలవరం ప్రాజెక్టులో భాగంగా చూడాలని, ప్రాజెక్టు నిర్మాణంలో కాంపొనెంట్ వారీగా నిబంధనలను సడలించాలని విజ్ఞప్తిచేస్తున్నాను.

పోలవరం ప్రాజెక్టు ముంపు బాధితులకు వీలైనంత త్వరగా పరిహారం ఇవ్వాలని విజ్ఞప్తిచేస్తున్నాను. ఆలస్యం అవుతున్న కొద్దీ ప్రాజెక్టు వ్యయం పెరిగిపోతుందనే విషయాన్ని మీ దృష్టికి తీసుకు వస్తున్నాను. డీబీటీ పద్ధతిలో ముంపు బాధితులకు ఈ సహాయం అందిస్తే జాప్యాన్ని నివారించవచ్చు.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని మరింత వేగవంతంగా ముందుకు తీసుకెళ్లడానికి అడహాక్‌గా రూ.10వేల కోట్లు మంజూరుచేయాలని కోరుతున్నాను.

(మిగతా 2లో)

## చెన్నైలో టీటీడీ పద్మావతి అమ్మవారి ఆలయ ప్రారంభం



**చెన్నై, (విశాఖ సమాచారమ్):** తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారు చెన్నై నగరవాసులను ఆశీర్వదించడానికి ఇక్కడ కొలువుదీరారని విశాఖ శారదా పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ స్వరూపానంద స్వామి సంతోషం వ్యక్తం చేశారు. అమ్మ ఆశీస్సులు పొందుతున్న చెన్నై వాసులు అదృష్టవంతులని స్వామి చెప్పారు.

చెన్నై జిఎన్ చెట్టి వీధిలో టీటీడీ నిర్మించిన శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయ మహాకుంభాభిషేకం శుక్రవారం శాస్త్రోక్తంగా, అత్యంత వేడుకగా జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శారదా పీఠాధిపతి భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి,చెన్నై స్థానిక సలహా మండలి అధ్యక్షులు శ్రీ శేఖర్ రెడ్డి కృషితో అమ్మవారి ఆలయం అద్భుతంగా నిర్మించారని అన్నారు. ఆలయ నిర్మాణానికి స్థలం విరాళంగా ఇచ్చిన సినీనటి కాంచన,వారి కుటుంబ సభ్యులు అదృష్టవంతులని, వారికి శ్రీ వేంకటేశ్వర స్వామి, శ్రీపద్మావతి దేవి ఆశీస్సులు ఉంటాయని అన్నారు. స్వామివారు ఆంధ్రప్రదేశ్ లో ఉన్నా తమిళులు తమ సొంతదైవంగా భావిస్తారని స్వామి చెప్పారు. తమిళ నాడులో శ్రీ వేంకటేశ్వర స్వామి భక్తులు అధిక సంఖ్యలో ఉన్నారన్నారు. మురుగన్ , శ్రీ వేంకటేశ్వర స్వామి, శ్రీపద్మావతి అమ్మవారి ఆశీస్సులతో తమిళనాడు రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆశీర్వదించారు. దేశంలోని జ్యోతిర్లింగాలు,అష్టాదశ శక్తి పీఠాల్లో కెల్లా తిరుమల శ్రీవారు గొప్ప దేవుడని స్వామి కొనియాడారు. ప్రపంచంలో వేదాలు

(మిగతా 2లో)

## ఫార్మశీ కళాశాల హాస్టల్ నిర్మాణానికి రూ 50 లక్షల విరాళం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆంధ్రవిశ్వవిద్యాలయం ఫార్మశీ కళాశాల పూర్వ విద్యార్థి దేవ పురాణం తాను చదువుకున్న కళాశాలలో విద్యార్థినుల హాస్టల్ నిర్మాణానికి ఇటీవల రూ 50 లక్షలు విరాళంగా అందించారు. ఫార్మశీ కళాశాలకు అనుకుని నూతనంగా నిర్మిస్తున్న ఫార్మశీ విద్యార్థినుల హాస్టల్ భవనానికి ఈ నిధులను వినియోగించాలని కోరారు. నిర్మాణం పూర్తిచేసుకున్న హాస్టల్ భవన సముదాయాన్ని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి సమక్షంలో దేవ పురాణం చేతుల మీదుగా ప్రారంభించి, విద్యార్థులకు అందుబాటులోనికి తీసుకువచ్చారు. నూతన హాస్టల్ భవన సముదాయానికి దేవ పురాణం తల్లిదండ్రులు 'లలిత దేవి-కోటిలింగ మూర్తి పురాణం' ఫార్మశీ విద్యార్థినుల హాస్టల్‌గా పేరు పెట్టారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీసీ పి.వి.జి.డి ప్రసాద రెడ్డి మాట్లాడుతూ తాను చదవుకున్న విశ్వవిద్యాలయానికి తిరిగి ఇవ్వాలనే మహెూన్నత ఆశయం కలిగి ఉండటం పట్ల అభినందనలు తెలిపారు. విద్యార్థినులకు ఉపయుక్తంగా నిలచే హాస్టల్ భవన సముదాయానికి నిధులు అందించిన దేవ పురణాన్ని అభినందించారు. ఇటువంటి వ్యక్తులను స్ఫూర్తిగా తీసుకుని నేటితరం విద్యార్థులు భవిష్యత్ సిఈఓలుగా, వ్యాపార వేత్తలుగా, శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. దీనికి అనువైన పరిస్థితులను ఏయూలో కల్పిస్తున్నామన్నారు. స్టార్టప్‌కు అనువైన 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో మౌళిక వసతులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఏయూలో ఫార్మ టెస్టింగ్ లాబరేటరీ ఏర్పాటు జరుగుతోందన్నారు.

భవన నిర్మాణ దాత, ఏయూ పూర్వ విద్యార్థి దేవ పురాణం మాట్లాడుతూ తాను నేడు అమెరికాలో ప్రముఖ ఫార్మశీ సంస్థ వైఎస్ ప్రెసిడెంట్‌గా సేవలు అందించడానికి కారణం తనకు విద్యను అందించిన ఏయూ ఫార్మశీ కళాశాలేనన్నారు. హాస్టల్ భవనానికి సహాయం అందించడం వర్సిటీ తనకు ఇచ్చిన అవకాశంగా భావిస్తున్నానన్నారు.

కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత,

(మిగతా 2లో)

# క్రికెట్ అభిమానులకు పోలీస్ సూచనలు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఈ నెల మార్చి19వ తేదీన ఏ.సి.ఎ-వీ.డీ.సి.ఏ డా.వై.ఎస్.ఆర్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో ఇండియా మరియు ఆస్ట్రేలియా దేశాల మధ్య జరుగనున్న అంతర్జాతీయ వన్డే క్రికెట్ మ్యాచ్ జరగనున్న సందర్భంగా విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ శ్రీ సిహెచ్.శ్రీకాంత్ ఐ.పి.ఎస్.,గారి ఆదేశాలతో నగర ప్రజలకు మరియు క్రికెట్ మ్యాచ్ ను వీక్షించడానికి వచ్చే ప్రేక్షకులకు క్రింది సూచనలు జారీ చేయడం జరిగినది.

అంతర్జాతీయ వన్డే క్రికెట్ మ్యాచ్ జరుగు రోజు తేదీ 19-03-2023 న ప్రజల సౌకర్యం కొరకు ఈ క్రింది ట్రాఫిక్ సూచనలు ఇవ్వడం అయినదిలి

1) మ్యాచ్ మధ్యాహ్నం 1:30 నుండి రాత్రి 10:30 వరకు జరుగును.

2) స్టేడియం కెపాసిటీ 28,000 లు. అనగా 28,000 వేల మంది మధురవాడ క్రికెట్ స్టేడియం కు వస్తారు. అలాగే వారి వాహనాలు కూడా వేల సంఖ్యలో ఉంటాయి కాబట్టి మ్యాచ్ తో సంబంధం లేని వాహనదారులు మధురవాడ క్రికెట్ స్టేడియం వైపు ప్రయాణించకుండా, వేరే మార్గాలలో ప్రయాణించమని తెలియ చేయడమైనది.

3) శ్రీకాకుళం, విజయనగరం, ఆనందపురం వైపు నుండి విశాఖపట్నం నగరం లోకి వచ్చే బస్సులు, ఇతర కమర్షియల్ వాహనాలు, మారికవలస వద్ద, ఎడమ వైపు కి తిరిగి, జురాంగ్ జంక్షన్ మీదుగా తిమ్మాపురం చేరి,కుడి వైపు తిరిగి బీచ్ రోడ్డు లో ప్రయాణించి, ఋషికొండ, సాగర్ నగర్, జోడుగుళ్లపాలెం మీదుగా వెళ్ళవలెను.

4) శ్రీకాకుళం, విజయనగరం, ఆనందపురం వైపు నుండి వచ్చే కార్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు మొదలైనవి, కార్ షెడ్ వద్ద నుండి మిధిలాపురి కాలనీ మీదుగా, %వీఎం% సిటీ వెనుకగా వెళ్లి, లా కాలేజీ రోడ్డు మీదుగా %చీఎ% 16 చేరి నగరం లోనికి వెళ్ళవలెను. లా కాలేజీ రోడ్డు నుండి, పనోరమ హిల్స్ మీదుగా, ఋషికొండ మీదుగా కూడా నగరం లోకి వెళ్ళవచ్చును.

5) విశాఖపట్నం నగరం లోనుండి, ఆనందపురం, విజయనగరం, శ్రీకాకుళం వైపు వెళ్ళు బస్సులు ఇతర కమర్షియల్ వాహనములు, హనుమంతవాక నుండి ఎడమ వైపు తిరిగి, ఆరిలోవ బిఆర్‌టీఎస్ రోడ్డు లో వెళ్లి, అడివివరం వద్ద కుడి వైపు తిరిగి ఆనందపురం మీదుగా వెళ్ళవలెను.

6) విశాఖపట్నం నగరం లో నుండి, ఆనందపురం, విజయనగరం, శ్రీకాకుళం వైపు వెళు ళ, కార్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు మొదలైనవి హనుమంతవాక జంక్షన్ నుండి ఎడమ వైపు తిరిగి, అడివివరం మీదుగా ఆనందపురం వెళ్ళవచ్చు, లేదా హనుమంతవాక జంక్షన్, లేదా విశాఖ వాలీ జంక్షన్, లేదా ఎండాడ జంక్షన్ వద్ద కుడి వైపు తిరిగి, బీచ్ రోడ్డు చేరి, తిమ్మాపురం వద్ద ఎడమవైపు తిరిగి, మారికవలస వద్ద %చీఎ% 16 చేరవచ్చును.

**భారీ వాహనాలకు సూచనలు:-**

1) ది 19/3/23 తేదీన ఉదయం 06:00 గంటల నుండి రాత్రి 12:00 గంటల వరకు ఎటువంటి భారీ వాహనాలు మధురవాడ స్టేడియం వైపు అనుమతించబడవు.

(మిగతా 2లో)

## ప్రశంసనీయంగా పోయిన సెల్‌ఫోన్ల రికవరీ




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** నగర పోలీస్ కమిషనర్ సిహెచ్ శ్రీకాంత్ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన చాట్ బాట్ వెబ్ పోర్టల్ కు సెల్ ఫోన్లు పోగొట్టుకున్నవారి నుంచి విశేష స్పందన లభిస్తుంది. గతంలో ఈ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేసుకున్న వారికి 100 సెల్ ఫోన్లను పోలీసులు రికవరీ చేసి బాధితులకు అందజేసారు. తాజాగా 40లక్షల రూపాయల ఖరీదు చేసే మరో 200 సెల్ ఫోన్లను రికవరీ చేసి వాటిలో కొన్నింటిని కొందరు బాధితులకు అందజేసారు. ఆ వివరాలను డిసిపి క్రైమ్ గంధం నాగన్న పోలీస్ బ్యారెక్స్ కాన్ఫరెన్స్ హాల్లో మీడియాకు వెల్లడించారు.

సెల్ ఫోన్లు పోగొట్టుకున్న వారు చాట్ బూట్ లో ఎలా ఫిర్యాదు చేయాలి, ఆ ఫిర్యాదులను సాంకేతిక పరిజ్ఞానం సాయంతో పోలీసులు ఎలా విచారించి బాధితులకు ఎలా అందజేస్తారో తెలియజేసారు. అదే సమయంలో దయచేసి ఎవరూ దొంగ ఫోన్లు కొనవద్దంటూ విజ్ఞప్తి చేసారు.

## (మొదటి పేజీ తరువాయిలు)

### ఢిల్లీలో సీఎం జగన్ సుడిగాలి పర్యటన

తెలంగాణ డిస్కంల నుంచి ఏపీ జెన్కోకు రావాల్సిన బకాయిలు అలానే ఉన్నాయి. 2014 జూన్ నుంచి 2017 జూన్ వరకూ సరఫరాచేసిన విద్యుత్తుకు సంబంధించి రూ.7,058 కోట్లు రావాల్సి ఉంది. వీటిని వెంటనే ఇప్పించాల్సిందిగా కోరుతున్నాను.

జాతీయ ఆహార భద్రతా చట్టం కింద లబ్ధిదారుల ఎంపికలో హేతు బద్ధత పాటించకపోవడం వల్ల రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతోంది. దీనివల్ల పీఎంజీకేఏవై కార్యక్రమం కిందకు రాని, 56లక్షల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వమే సొంతంగా రేషన్ ఇస్తోంది. దాదాపు రూ.5,527 కోట్ల భారాన్ని మోయాల్సి వస్తోంది. ఈ విషయంలోఆంధ్రప్రదేశ్ చేసిన విజ్ఞప్తి సరైనదేనని నీతి ఆయోగ్ కూడా నిర్ణయించిన నేపథ్యంలో తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కేంద్ర ప్రభుత్వం వినియోగించని రేషన్ కోటాను రాష్ట్రానికి కేటాయించాల్సిందిగా కోరుతున్నాను.

రాష్ట్ర విభజన సమయంలో ప్రత్యేక హెూదా ఇస్తామంటూ పార్లమెంటు సాక్షిగా కేంద్రం హామీ ఇచ్చింది. దీనివల్ల రాష్ట్రానికి గ్రాంట్లు, పన్ను రాయితీలు లభిస్తాయి. ఆర్థికంగా రాష్ట్ర ప్రభుత్వానికి మేలు జరుగుతుంది. పెద్ద ఎత్తన పరిశ్రమలు రావడమేకాకుండా, సేవారంగం విస్తరిస్తుంది. స్వయం శక్తి దిశగా రాష్ట్రం అడుగులేసేందుకు తోడ్పడుతుంది. రాష్ట్రానికి ప్రత్యేక హెూదా ఇవ్వాలని విజ్ఞప్తిచేస్తున్నాను.

రాష్ట్రంలో 13 జిల్లాలను 26 జిల్లాలుగా చేశాం. ప్రతిజిల్లాకు సుమారుగా 18లక్షలమంది జనాభా ఉన్నారు. కొత్తగా కేంద్రం మంజూరుచేసిన మూడు మెడికల్ కాలేజీలతో కలిపి మొత్తంగా 14 మాత్రమే ఉన్నాయి. మిగిలిన 12 కాలేజీలకు వీలైనంత త్వరగా అనుమతులు మంజూరుచేయాలని కోరుతున్నాను. ఈ కాలేజీలకు సంబంధించిన పనులు అత్యంత వేగంగా ముందుకు సాగుతున్నాయి. వీటికి సంబంధించి కేంద్రం తగిన విధంగా సహాయపడాలని విజ్ఞప్తిచేస్తున్నాను.

వైఎస్సార్ కడప జిల్లాలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని ఏపీ పునర్విభజనచట్టంలో కేంద్రం హామీ ఇచ్చింది. ఈ ప్లాంట్ నిలదొక్కుకోవాలంటే ఖనిజ కొరత లేకుండా ఏపీ ఎండీసీకి గనులు కేటాయించాలని విజ్ఞప్తిచేస్తున్నాను.

### చెన్నైలో టీటీడీ పద్మావతి అమ్మవారి ఆలయ ప్రారంభం

ఇంకా బతికి ఉన్నాయంటే అది శ్రీవేంకటేశ్వర స్వామి దయేనని, స్వామి వేద పరిరక్షకుడని చెప్పారు.

అంతకు ముందు టీటీడీ చైర్మన్ శ్రీవైవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ, దేశంలో తిరుచానూరు తరువాత శ్రీ పద్మావతి అమ్మవారు చెన్నై నగరంలోనే కొలువుదీరారని చెప్పారు. స్థలదాత సినీనటి కాంచన వారి కుటుంబసభ్యులు, టీటీడీ స్థానిక సలహామండలి అధ్యక్ష్యులు శ్రీ శేఖర్ రెడ్డి సభ్యుల సహకారంతో శ్రీపద్మావతి అమ్మవారి ఆలయం అద్భుతంగా నిర్మించినట్లు ఆయన తెలిపారు. శ్రీశేఖర్ రెడ్డి మాట్లాడుతూ అమ్మవారి ఆలయ నిర్మాణంలో తాము పాలుపంచుకోవడం అదృష్టమన్నారు.

### ఫార్మసీ కళాశాల హాస్టల్ నిర్మాణానికి రూ 50 లక్షల విరాళం

ఇంచార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.కిషోర్ బాబు, ప్రిన్సిపాల్స్ ఆచార్య వై.రాజేంద్ర ప్రసాద్,టి.శోభశ్రీ, హాస్టల్ చీఫ్ వార్డెన్ ఏ.కె.ఎం పవార్, పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, అంబేద్కర్ చైర్ ప్రొఫెసర్ ఆచార్య జేమ్స్ స్టీఫెన్, పురాణం కోటిలింగం(రాంబాబు) తదితరులు పాల్గొన్నారు.

### క్రికెట్ అభిమానులకు పోలీస్ సూచనలు

2) అనకాపల్లి నుండి విజయనగరం, శ్రీకాకుళం వైపు వెళ్ళు వాహనాలు, నగరం లోకి రాకుండా, సబ్బవరం, పెందుర్తి, ఆనందపురం మీదుగా వెళ్ళవలెను.

3) శ్రీకాకుళం, విజయనగరం, వైపు నుండి అనకాపల్లి వైపు వెళు ్ళ వాహనాలు, నగరం లోకి రాకుండా, ఆనందపురం నుండి పెందుర్తి, సబ్బవరం మీదుగా అనకాపల్లి వైపు వెళ్ళవలెను.

4) విశాఖపట్నం నగరంలో నుండి బయలుదేరి, విజయనగరం, శ్రీకాకుళం వైపు వెళ్ళు భారీ వాహనాలు అన్నీ అనకాపల్లి వైపు వెళ్లి, సబ్బవరం, పెందుర్తి, ఆనందపురం మీదుగా వెళ్ళవలెను.

5) శ్రీకాకుళం, విజయనగరం వైపు నుండి విశాఖపట్నం నగరం లోకి వచ్చు భారీ వాహనాలు అన్నీ, ఆనందపురం నుండి పెందుర్తి, సబ్బవరం మీదుగా అనకాపల్లి మీదుగా విశాఖపట్నం నగరం చేరవలెను.

**మ్యాచ్ చూడడానికి వచ్చు వాహనదారులకు సూచనలు:**

1) విశాఖపట్నం నగరం వైపు నుండి స్టేడియం కు వచ్చు VVIP, VIP వాహనదారులు, NH 16 లో స్టేడియం వరకు ప్రయాణించి, A గ్రౌండ్, B గ్రౌండ్, V కన్వెన్షన్ గ్రౌండ్ లలో వారి వారి పాస్ ప్రకారం చేరవలెను.

2) విశాఖపట్నం వైపు నుండి స్టేడియం కు వచ్చు టికెట్ హెూల్డర్స్, NH 16 లో ప్రయాణించి, స్టేడియం వద్ద గల హెూల్ ఏజ్ జంక్షన్ వద్ద ఎడమ వైపు తిరిగి, సాంకేతిక ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్ లో పార్కింగ్ చేసుకొనవలెను. సాంకేతిక ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్ లో, ఆన్ లైన్ టికెట్స్ ను, ఒరిజినల్ టికెట్స్ గా మార్చుకొనుటకు కౌంటర్లు ఏర్పాటు చేయడం అయినది.

3) శ్రీకాకుళం, విజయనగరం, ఆనందపురం, గంభీరం, బోయపాలెం, కొమ్మాది వైపు నుండి వచ్చు వారు, కార్ షెడ్ జంక్షన్ వద్ద కుడి వైపు తిరిగి, సాంకేతిక ఇంజనీరింగ్ కాలేజీ పార్కింగ్ గ్రౌండ్ చేరవలెను. లేదా కార్ షెడ్ జంక్షన్ నుండి ఎడమ వైపు తిరిగి, మిధిలాపురి కాలనీ మీదుగా వచ్చి, MVV సిటీ డబల్ రోడ్డు, పోలిశెట్టి వేణుగోపాలరావు గ్రౌండ్ ల లో పార్కింగ్ చేయవలెను.

4) విశాఖపట్నం నగరం నుండి లేదా భీమిలి వైపు నుండి బీచ్ రోడ్డు మీదుగా స్టేడియం కు వచ్చు వారు, IT SEZ మీదుగా వచ్చి MVV సిటీ డబల్ రోడ్డు చేరి పార్కింగ్ చేసుకోవలెను.

5) విశాఖపట్నం నగరం నుండి వచ్చే Rtc స్పెషల్ బస్సులు NH 16 లో రాకుండా, బీచ్ రోడ్డు లో వచ్చి, IT SEZ మీదుగా వచ్చి, లా కాలేజీ రోడ్డు లో పార్కింగ్ చేయవలెను.

6) శ్రీకాకుళం, విజయనగరం, ఆనందపురం వైపు నుండి వచ్చు %ఖి%ి స్పెషల్ బస్సులు, మారికవలస, తిమ్మాపురం, %ఖ రాజ్టు% మీదుగా వచ్చి, లా కాలేజీ రోడ్డు చేరి పార్కింగ్ చేయవలెను.

మ్యాచ్ వీక్షించడానికి వేల సంఖ్యలో వచ్చే ప్రేక్షకులు తమ వాహనాలను తమకు పైన నిర్దేశించిన పార్కింగ్ ప్రాంతాలలో మాత్రమే పార్కింగ్ చేసుకోవాలి.

పూర్తి భద్రతతో ఎటువంటి అపశ్రుతులూ జరగకుండా స్టేడియం చుట్టూ బారికేడింగ్ ఎర్పాటు చేయడం జరిగినది.

ప్రేక్షకులు తమకు టికెట్స్ తో తమకు నిర్దేశించిన గేట్ల ద్వారా స్టేడియంలోనికి ప్రవేశించాలని ఈ సందర్భంగా తెలియజేయడం జరిగినది.

ముఖ్యమైన పాయింట్లలో ఏసిపి స్థాయి అధికారులను నియమించడం జరిగినది.

స్టేడియం చుట్టూ మూడు అంచల భద్రత ఏర్పాటు చేయడం జరిగినది.

## కేజీహెచ్‌లో జనన, మరణ ధృవీకరణ నమోదు ప్రక్రియపై ఆరా!



**కలెక్టరేట్, (విశాఖ సమాచారమ్):** దేశంలో జనన, మరణ దృవీకరణ నమోదు ప్రక్రియ మరింత వేగవంతం చేసేదిశగా డైరెక్టర్ ఆఫ్ సెన్సెస్ఆపరేషన్ (డిసిఒ) ఏపి. మినిస్టిరీఆఫ్ హెూమ్ ఎఫైర్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ పి. బాలకిరణ్ ఐఏఎస్ ఏపిలోని పలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో జనన, మరణ ధృవీకరణతో పాటు మెడికల్ రికార్డు ఆఫీసు నుండి జారీ చేసే సర్టిఫికేట్స్ ప్రక్రియ పనితీరుపై ప్రత్యేకంగా ఆరా తీసే చర్యలకు దిగారు.ఈ నేపథ్యంలో కేజీ హెచ్ ఎంఆర్డిఒ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం తనికీలు చేపట్టారు. మెడికల్ రికార్డు ఆఫీసు నుండి జారీ చేస్తున్న దృవీకరణ పత్రాల కాలపరిమితి, నమోదు, లబ్దిదారులకు పత్రాల జారీ చేస్తున్న తీరును స్వయంగా పరిశీలించారు. జనన మరణ దృవీకరణ పత్రాల జారీ చేస్తున్న వ్యవహారం పైవిపులంగా అక్కడ పనిచేస్తున్న డివోలను అడిగి తెలుసుకున్నారు. కేజీహెచ్లో అనారోగకారణంగా వివిధ కారణాలతో ఇన్పేషెండ్గా చేరి మరణించడం, అదేవిధంగా పురుళ్ళవార్డులో చేరి శిశు వులకు జన్మనిచ్చే తల్లులకు డిశ్చార్జ్ తర్వాత అవసరమైన జనన దృవీకరణ పత్రం ఎన్ని రోజుల్లో అందిస్తున్నది గత రికార్డుల వివరాల ద్వారా పరిశీలించారు. మరణించినవారికి దృవీకరణ పత్రాలతపాటు భీమా సంస్థలకు అందిస్తున్న సర్టిఫికేట్స్ కాలపరిమితి పై ప్రత్యేకంగా ఆరా తీశారు. సిఎస్ఆర్డిఒ ఎంఆర్డి కోడ్ ద్వారాసిస్టిమ్ నుండి దృవీకరణ పత్రాల జారీ లోసుగులపై ప్రత్యేకంగా వివరాలు సేకరించారు.

మెడికల్ రికార్డు ఆ ఫీసు ద్వారా ఏ పద్దతిలో దృవీకరణ పత్రాలు జారీ జరుగుతుందన్న విషయాలను నిశితంగా తనికీ చేశారు. ప్రసూతి వార్డులో ప్రసవం కోసం చేరిన వారికి ప్రసవం తర్వాత వివరాలు డిసీఓకు అందేలా శ్రద్ధ వహించాలన్నారు. కేజీహెచ్ మెడికల్ రికార్డు ఆఫీసు ద్వారా నిబ్దతగా దృవీకరణ పత్రాలు జారీ సంబందిత బాధిత కుటుంబాలకు అందేలా ఆసుపత్రి సిబ్బంది, అధికారులు ప్రత్యేక శ్రద్ధవహించి పనిచేయాలని ఆదేశించారు. కరోనా మరణ దృవీకరణలో కేజీహెచ్నుండి బాధిత కుటుంబాలకు మరణ ధృవీకణలో ఇబ్బందులను పత్రికా ప్రతినిధులు ఆయన దృష్టికి తెచ్చాడు.

కాజ్ ఆఫ్ డెత్ కెషీట్లో నమోదు చేయకపోవడం. నిజమైన బాధిత కుటుంబీకులకు దృవీకరణలు అందక కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అందించే ఆర్థిక సహాయం అందే అవకాశం కొల్పోయిన విషయాన్ని ఆయన ముందుంచగా, దీనిపైడైరెక్టర్ ప్రత్యేక శ్రద్ద వహించి దృవీకరణలో కేజీహెచ్నుండి బాధిత కుటుంబాలకు మరణ దృవీకరలో ఇబ్బందులను పత్రికా ప్రతినిధులు ఆయన దృష్టికి తెచ్చారు. కాజ్ ఆఫ్ డెత్ కెషీట్లో నమోదు చేయకపోవడం, నిజమైన కరోనా వరణాల్లో బాధిత కుటుంబీకులకు దృవీకరణలు అందక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ఆర్థిక సహాయం అందేఅవకాశం కొల్పోయిన విషయాన్ని ఆయన ముందుంచగా, దీనిపైడైరెక్టర్ మౌనం వహించడం గమనార్హం. అనంతరం కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్ కుమార్ ఛాంబర్లో సమావేశమయ్యారు. ఈ విషయంపై ఇరువురు విపులంగా చర్చించారు. ఈ సమావేశంలో సిఎస్ఆర్ట్ డాక్టర్ వాసుదేవ్,ఏడిశ్రీనివాసకుమార్, ఎమ్మార్వో, అకౌంటెండెంట్ సత్యనారాయణ, డిఎంఅండ్ హెర్టీ అధికారులు పాల్గొన్నారు.

## అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి నేడు

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** పొట్టి శ్రీరాములు గారు చనిపోయేటప్పటి ఇంటి ముందు గోడమీద బొగ్గు తో " పొట్టి శ్రీరాములను పొట్టన పెట్టుకున్న రాజాజీని ఉరితీయాలి" అని రాసేరు. ఆంధ్ర రాష్ట్రం వచ్చేవరకు అది ఎవ్వరూ చెరపలేదు.అప్పట్లో మనం మద్రాసు ఉమ్మడి రాష్ట్రం లోనే ఉంటున్నాం. ప్రకాశం పంతులు గారు ముఖ్యమంత్రిగా పనిచేసి రాజాజీ రాజకీయానికి, తన అహంకారానికి పదవీచ్యుతుడయ్యాడు. తెలుగువారంటే ఆరంభ శూరులు మాత్రమే నని పుకారు పుట్టించారు. తమిళుల హేళనలు దౌర్జన్యాలు మితిమీరినా మనల్ని తెలుగువారు అని కాకుండా మద్రాసీయులు అనే పిలిచేవారు . స్వాతంత్ర్యం వచ్చాక కూడా మనకు గుర్తింపులేదు. మద్రాసు మొదలు తంజావూరు వరకు తెలుగువారితో నిండిపోయింది. కానీ తెలుగుకు ప్రాధాన్యత లేదు. 1952 వచ్చినా ఆంధ్రావాళ్లంటే తెలియదు మద్రాసు వాళ్లమే మొత్తం ప్రపంచానికి. ఈ బాధ భరించలేక స్వామి సీతారాం అనే ఆయన గుంటూరులో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు.

రాజాజీ ప్రభుత్వం శిబిరాన్ని అణిచివేసి సీతారామ్ దీక్షను భగ్నం చేసింది. పైగా తెలుగువారు ఆరంభశూరులు అని మళ్ళీ హేళన చేసింది.

దిగమింగుకోలేని ఈ అవమానానికి పొట్టి శ్రీరాములు గారు స్పందించారు. సర్కార్ ఎక్స్ ప్రెస్ లో గుడివాడలో ఎక్కి మద్రాసులో దిగి బులుసు సాంబమూర్తిగారి ఇంట దీక్ష ప్రారంభించారు. రాజాజీ కోపంతో ఊగిపోయాడు. రాష్ట్రాన్ని ముక్కలు కానివ్వను అని సవాల్ చేశారు ఎవరైనా కాంగ్రెస్ వారు ఆ వైపుకు వెళ్ళారా వారి అంతు చూస్తానన్నారు. దీనితో కాంగ్రెస్ వాడైన పొట్టిశ్రీరాములు ఒంటరివాడైపోయాడు. యెర్నేని సాధు సుబ్రహ్మణ్యం తప్ప ఆయన వెంట ఎవరూ లేరు. అయినా తన దీక్షను పొట్టిశ్రీరాములు వదల్లేదు. 9వ రోజు నెహ్రూకి తెలిసి రాజాజీకీ పోన్ చేసారు. అవన్నీ ఉడత ఊపులేనని తాను అణిచివేస్తానని రాజాజీ నెహ్రూ కు నమ్మబలికారు. తెలుగువారు లక్షల మంది ఉన్న మద్రాసు నగరంలో ఆదరణ లభిస్తుందని అనుకుంటే ఒక్కరూ అటువైపు రాలేదు. అదీ తెలుగువారి ఐక్యత. సమస్య కాంగ్రెస్ ది కాదని, తెలుగువారి ఆత్మగౌరవం కోసమని గ్రహించటంలో అంతా రాజాజీ బుట్టలో పడ్డారు. తెలుగునాయకులంతా ముఖం చాటేశారు. 58 రోజులు ఒక మనిషి ఆహారం తీసుకోకుండా దీక్ష చేస్తుంటే ఏ తెలుగువారికీ జాలీ దయ కలగలేదు. టంగుటూరి ప్రకాశం పంతులుగారు రాజాజీకీ వ్యతిరేకం గనుక ఆయన వెళ్ళి మద్దతు ప్రకటించి వెళ్ళారు. కేవలం తన బాధనంతా మిత్రులకు లేఖల్లో వెళ్ళబోసుకున్నారు పొట్టిశ్రీరాములు. వారిలో ముఖ్యులు సాధు సుబ్రహ్మణ్యం గారి అల్లుడు మునునూరి భాస్కరరావు. కూరాళ్ల భుజంగం తదితరులు. పొట్టిశ్రీరాములు శారీరక స్థితి నిరాహారంతో ఎప్పుడో అదుపుతప్పింది. ఆ బాధ భరించలేక ఆయన గావుకేకలు పెట్టేవారు. పేగులు పుండ్లుపడి పురుగుల నోటి వెంట వచ్చేవి. కళ్ళు చెవులు నుంచి కూడా వచ్చేవి. జీర్ణవ్యవస్థ తిరగబడి మలం కూడా నోటినుంచి వచ్చేది. వర్ణించటానికి వీలులేనంత దారుణమైన శారీరక దాష్టీకంతో నిండుకుండ వంటి శ్రీరాములు నిర్జీవుడవ్వటానికి 58 రోజులుపట్టింది. ఎంత దారుణమరణవేదన అనుభవించి తెలుగువారి కోసం ఆయన అసువులు బాసారో చెప్పటానికి మాటలే లేవు.ఇక మరణించాక మరీ దారుణం ఎదురైంది. తెలుగువారి హీన దీన హైన్య చాతకానితనం ఎటువంటిదంటే ఆయన శవాన్ని ముట్టుకోవడానికి కూడా నలుగురు తెలుగువాళ్ళు రాలేదు. ఆయన మన తెలుగువారి కోసమే చనిపోయారని తెలిసినా కూడా స్పందించలేదు. చివరికి ఒంటరివాడిగా ఉన్న గుడివాడ సాధు సుబ్రహ్మణ్యం కనీసం మన గుడివాడ వాళ్ళవైనా సహాయం అడిగి శవదహనం చేద్దామని ఆశయాన్ని చంపుకుని వ్యక్తిగత భిక్షగాడిగా గుడివాడకు చెందిన సినీగాయకుడు ఘంటసాల దగ్గరకు వెళ్ళి విషయం చెప్పి మన గుడివాడ నుండి వచ్చాడు గనుక మనమైనా సాగనంపుదాం అని ఒప్పించి తెచ్చారు. ఘంటసాల వెంట మోపర్రు దాసు అనే కళాకారుడు నేను గుడివాడ వాడినే కదా నేనూ వస్తానని వచ్చారు. శవాన్ని తాటాకులతో కాకులు పొడవకుండా కప్పివచ్చిన సుబ్రహ్మణ్యాన్ని శవం ఎక్కడా అని ఘంటసాల అడిగారు. ఒక్కొక్క తాటాకూ తీసి శవాన్ని చూస్తున్న ఘంటసాల గుండె కరిగిపోయింది. మరణం ఇంత దారుణంగా ఉంటుందా అని హతాశుడైపోయాడు. ఎవరి కోసం చచ్చిపోయాడు ఆ దీనుడు అని కన్నీరుమున్నీరు అయిపోయారు. వాంతు చేసుకున్నారు. తెలుగుజాతి కోసం తన ప్రాణాలు దానం చేసిన ఆ మహనీయుడి శవాన్ని ఎవరికీ తెలియకుండా తీసుకువెళ్ళటం సబబుకాదు అని తెలుగువాళ్ళ కళ్లు తెరిపించడానికి ఈ శవమే దిక్కు కావాలని ఆవేశంతో ఊగిపోయారు. వెంటనే ఒక ఎద్దులబండి మాట్లాడి శవాన్ని అందులోకి ఎక్కించారు. అప్పటికప్పుడే ఆశువుగా ఘంటసాల తన వీరకంఠాన్ని ఎలుగెత్తి తెలుగుజాతి పౌరుషం చచ్చిందని , చీము నెత్తురు లేని తెలుగుజాతి కోసం అసువులశ్రీరాములు నువ్వు అంటూ గొంతెత్తి పాడతూ శవయాత్ర ప్రారంభించారు.

గుండెల్ని పిండే ఘంటసాల మాటలు పాటలకు మద్రాసు ప్రెసిడెన్సి కాలేజీ ముందుగా శవం వెళ్తున్న సమయంలో విన్న కాలేజి కుర్రాళ్ళు పౌరుషంతో అమరజీవి జోహార్ అంటూ బండివెంట అరుస్తూ యాత్రలో చేరారు. అమరజీవి మరణవార్త టెలిగ్రాం ద్వారా ఆంధ్రకేసరికి తెలపటంతో ఆయన మెయిల్ కి మద్రాసు వచ్చారు. సరిగ్గా ఆ సమయానికి శవయాత్ర మద్రాసు సెంట్రల్ రైల్వే స్టేషన్ కు చేరింది. శ్రీరాములు దారుణశవ పరిస్తితిని చూడగానే ఆంధ్రకేసరి ఆవేశం కట్టలు తెంచుకుంది. బూతుపురాణంతో తెలుగుజాతి చాతకానితనాన్ని ఆయన చీల్చిచెండాడుతూ పనికిరాని తెలుగుజాతి ....రా అంటూ పెట్టిన పెడబొబ్బలకి ఎలా కదిలారో లక్షలాది మంది తెలుగువారు క్షణాల్లో మద్రాసు నగరం మంటల్లో తగలబడింది. షాపులు లూటీ అయ్యాయి. ఆంధ్రదేశమంతా అట్టుడికి పోయింది. 8 మంది పోలీసు కాల్పుల్లో చనిపోయారు. నెహ్రూ రాజాజీని చివాట్లు పెట్టి ప్రజలను శాంత పడమని శ్రీరాములు మరణం వృధాపోదని ఆంధ్రులకి ప్రత్యేక రాష్ట్రం ఇస్తామని పార్లమెంటులో ప్రకటించటంతో తెలుగుజాతి ఊరడిల్లింది. సాధుసుబ్రహ్మణ్యంగారే శవానికి దహనక్రియలు కర్మకాండ జరిపారు. ఆ త్యాగజీవి కీ. శే పొట్టి శ్రీరాములు గారి ప్రాణత్యాగం ఫలితం గా మనకు ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం ఆంధ్ర ప్రదేశ్ గా అవతరించింది.

మిత్రులకు విన్నప్పము, ,ఈ కష్టం మనకు తెలీదు కనీసం మన పొట్టిశ్రీరాములు ,ఘంటసాల,ప్రకాశం పంతులు గొప్పతనం మన పిల్లలకు తెలియజెప్పటం మన బాధ్యత.

## ఫిట్నెస్ హబ్ ను ప్రారంభించిన నగర మేయర్

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** యువత మంచి అలవాట్లతో ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతినిత్యం ఏదో ఒక వ్యాయామాన్ని ఎంచుకోవాలని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి సూచించారు. శుక్రవారం ఆమె గాజువాకలోని బీసీ రోడ్డు పరిధిలో చిన్న అప్పారావు కాంప్లెక్స్ లో ఏర్పాటు చేసిన ఫిట్నెస్ హబ్బును నిర్వాహకులు ఆనంద్ మణికంఠ, గాజువాక వైయస్సార్సీపి ఇంచార్జ్ దేవాన్ రెడ్డి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించేందుకు ఏదో ఒక వ్యాయామాన్ని ఎంచుకోవాలని మారుతున్న కాలానికి అనుగుణంగా మంచి ఆహారాన్ని తీసుకుంటూ ఉండాలని తెలిపారు.

నిర్వాహకులు ఆనంద్ మణికంఠ ఏర్పాటు చేసిన ఫిట్నెస్ హబ్బును ఉపయోగించుకొని తమ శరీర ఆకృతిని బరువును తగ్గించుకోవచ్చని తెలిపారు. ముఖ్యంగా ఈ ఫిట్నెస్ హబ్బులో స్త్రీ పురుషులకు వేరువేరుగా వ్యాయామం చేసుకొనేందుకు పరికరాలు ఉన్నాయని, గాజువాక బీసీ రోడ్డు పరిసర ప్రాంతాల యువత హబ్లో మెంబర్స్ గా చేరాలని సూచించారు. ప్రతిరోజు ప్రతి ఒక్కరూ మంచి ఆహారాన్ని తీసుకుంటూ ఒక గంట తమకోసం కేటాయించి సరైన వ్యాయామం చేసినట్లయితే ఆరోగ్యంగా ఉండగలుగుతారని పేర్కొన్నారు.

### పంచాంగం

శనివారం 18-03-2023
శుభకృత్ నామ సంవత్సరము
ఉత్తరాయణం శిశిర ఋతువు
ఫాల్గుణ మాసం

తిథి : బ. ఏకాదశి ఉ. 08.34 త. ద్వాదశి
నక్షత్రం : శ్రవణం రా. 10.39
వర్జ్యం : ఉ. 02.22 ల 03.50



సమస్యలతో సతమతమవడం కంటే సాధకుల సహాయం కోరుట మేలు.
బ్రహ్మశ్రీ హనుమద్దాస్ స్వామీజీ గారు ప్రస్తుతం చెన్నైలో ఉన్నారు.
సెల్ : 9440537607


## భోజనంపై పెద్దల పలుకులు

భోజనం కోసం పెద్దలు,ప్రముఖుల, మహాత్ముల అభిప్రాయాలూ , అనుభవాలు

1. ఆకలిగొన్నవాడికి ' దేవుడు ' కనపడేది అన్నం రూపంలోనే !
( మహాత్మా గాంధీ ).

2. " నేను వంటింట్లోకి వేలెలి లిపనిమీదవెళ్ళినాకూడా , వంట చేస్తున్న మా అమ్మగారు. "లి లిపెట్టేస్తా నాన్నా ఒక్క అయిదు నిముషాలు " అనేవారులి లినొచ్చుకుంటూ- నేను అన్నం కోసం వచ్చాననుకుని !
ఎంతయినా అమ్మ అంటే అన్నం. అన్నం అంటే అమ్మ ! అంతే !
( జంధ్యాలగారు ).

3. మంచి భోజనం లేని పెళ్ళికి వెళ్ళటం - సంతాపసభకి వెళ్ళినదానితో సమానం !
( విశ్వనాధ సత్యనారాయణ గారు ).

లి??4. రాళ్లు తిని అరిగించుకోగల వయసులో వున్నప్పుడు తినటానికి మరమరాలు కూడా దొరకలేదు ! వజ్రాలూ , వైడూర్యాలూ పోగేసుకున్న ఈ వయసులో మరమరాలు కూడా అరగట్లేదు ! అదే విధి !
( రేలంగి వెంకట్రామయ్య గారు ).

5. ఆరురోజుల పస్తులవాడి ఆకలి కన్నా, మూడురోజుల పస్తులవాడి ఆకలి మరీ ప్రమాదం ! ఆహారం దొరికినప్పుడు ముందు వాడ్నే తిననివ్వాలి !
( ముళ్ళపూడి వెంకటరమణ గారు ).

6. ఏటా వందబస్తాల బియ్యం మాకు ఇంటికి వచ్చినా మా తండ్రిగారు
" అన్నీ మనవికావు నాయనా " అని బీదసాదలకి చేటలతో పంచేసే వారు.లి
లిఅన్నీ మనవికావు అనటంలో వున్న వేదార్థం నాకు పెద్దయితేనేగానీ అర్థం కాలేదు !
( ఆత్రేయ గారు )

7. అమ్మకి నేను అన్నం పెడుతున్నాను అనటం మూర్ఖత్వం!
అమ్మ చేతి అన్నం తింటున్నాను అని చెప్పగలిగినవాడు ధన్యుడు !
( చాగంటి కోటేశ్వర రావుగారు ).

8. ఆకలితో వున్న వాని మాటలకు ఆగ్రహించవద్దు !!
( గౌతమ బుద్ధుడు ).

9. ఆత్మీయులతో కలసి తినే భోజనానికి రుచి ఎక్కువ ! చారుకూడా అమృతంలా రుచిస్తుంది !
( మాతా అమృతానందమయి ).

10. మీ భర్త ఎంత ధనవంతుడయినా, మీకోసం మీరు స్వంతంగా ఒక కప్పు కాఫీ సంపాదించుకునే శక్తి లేనప్పుడు మిడిసిపడటం అనవసరం !
( యద్దనపూడి సులోచనారాణిగారు ).

11. మీ పిల్లలు ఎంతదూరంలో, ఎక్కడవున్నా , వేళపట్టున ఇంత అన్నం తినగలుగుతున్నారంటే అది వాళ్ళ గొప్పాకాదూ , మీ గొప్పాకాదు.
మీ పూర్వీకుల పుణ్యఫలమే అని గుర్తించు.

## బాబా ఆలయంలో సినిమా షూటింగ్

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** దొర ఎంటర్టైన్మెంట్ సమర్పణలో ప్రొడక్షన్ నెంబర్ -1 షూటింగ్ శుక్రవారం కైలాసపురం లోని సాయిబాబా ఆలయంలో జరిగింది. ఈ షూటింగ్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి హాజరై ముహూర్తపు షాట్ క్లాప్ కొట్టి ప్రారంభించారు. అలాగే దేవుడి చిత్రపటంపై చిత్రీకరించారు. ఈ షూటింగ్ ఒకే షెడ్యూల్ లో ఏప్రిల్ నెలలో విశాఖ, పశ్చిమ, తూర్పు జిల్లాల్లో జరుగుతుందని దర్శక, నిర్మాత లు తెలిపారు. ఈ సినిమాలో హీరో, హీరోయిన్లుగా వంశీ, ప్రియాంక సింగ్, కీర్తన వర్మ నటిస్తున్నారు.

అదే విధంగా ఈ చిత్రానికి దర్శకత్వం రామ్ గోపాల్ రత్నం, డివోపీ రమణ, నిర్మాత హనుమంతు తుకారామ్.

ఈ కార్యక్రమంలో వి జే ఎఫ్ అధ్యక్షులు, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ సభ్యులు గంట్ల శ్రీనుబాబు, ఆర్ కే మీడియా హౌస్ అధినేత బి. రవికాంత్, దర్శక, నిర్మాతలు రామ్ గోపాల్ రత్నం, హనుమంత్ తుకారాం, హీరో, హీరోయిన్లు వంశీ, ప్రియాంక సింగ్, కీర్తన వర్మ తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ సమాచారమ్

శనివారం 18-03-2023


## మనిషి వలె నాడి కొట్టుకునే గణపతి విగ్రహం ఉంది.. తెలుసా ?

మన దేశంలో ఎన్నో అద్భుత ఆలయాలు ఉన్నవి. అలాంటి అద్భుత ఆలయాల్లో అరుదైన ఈ ఆలయం కూడా ఒకటిగా చెబుతారు. బ్రిటిష్ కాలంలో అప్పటి గవర్నర్ ఈ ఆలయంలో విగ్రహ ప్రతిష్ట చేస్తుంటే వచ్చి రాతికి ప్రాణం ఉంటుందా అని హేళన చేయగా , ఒక సిద్ధయోగి దాన్ని రుజువు చేసి ఆ గవర్నర్ స్వయంగా వచ్చి నమస్కరించేలాగ చేసాడు. మరి ఆ ఆలయం ఎక్కడ ఉంది...? ఆ ఆలయంలో విగ్రహ ప్రతిష్టప్పుడు ఏం జరిగిందనే విషయాల గురించి మనం ఇప్పుడు తెలుసుకుందాం.

తమిళనాడు రాష్ట్రం, తిరునల్వేరి జిల్లాలో కుర్తాళం ఉంది. ఇక్కడే మౌనస్వామి మఠం, కుర్తాల పీఠం, గణపతి ఆలయం ఉన్నవి. ఇక్కడ అద్భుత జలపాతం ఉండగా ఇందులోని మూలికలు ఎన్నో రకాల వ్యాధులను నయం చేస్తాయని నమ్మకం మాత్రమే కాదు పరిశోధనలలో రుజువు అయింది.

ఇక్కడ ఉన్న చిత్రావతి జలపాతం దాదాపుగా అరవై అడుగుల ఎత్తు నుండి చాలా వేగంగా క్రిందకు దూకుతుంది. ఇక్కడ అనేక రకాల మూలికలు దొరకడమే కాదు మానసిక వికలాంగులు ఈ నీటిలో స్నానం చేస్తే మానసిక రుగ్మతతో పాటు ఎన్నో శారీరక సమస్యలు తొలగిపోతాయని చెబుతారు.

ఇక గణపతి ఆలయ విషయానికి వస్తే, ఇక్కడ ఉన్న గణపతిని 'నాడి గణపతి' అని పిలుస్తారు. ఇలా నాడి గణపతి అని పిలవడానికి కారణం ఏంటంటే, మహా సిద్ధయోగి మౌనస్వామి తపస్సు చేయడానికి ఈ ప్రాంతాన్ని ఎంచుకొని ఇక్కడ ఒక మఠాన్ని ఏర్పాటు చేయడమే కాకుండా ముందుగా శ్రీ సిద్దేశ్వరి అమ్మవారిని ప్రతిష్టించారు. ఆ తరువాత ఇక్కడ గణపతి దేవుడిని ప్రతిష్టించి విగ్రహానికి ప్రాణ ప్రతిష్ట చేయాలని భావించగా, అది తెలిసిన మద్రాస్ గవర్నర్ ఎడ్వార్డ్ రాతికి ప్రాణ ప్రతిష్ట ఏంటి అంటూ హేళనగా అనడంతో, ఆ సిద్ధ యోగి ఒక వైద్యుడిని పిలిపించమని చెప్పగా, అతడు వైద్యుడిని పిలిపిస్తాడు, మౌనస్వామి వైద్యుడితో విగ్రహానికి నాడి పరీక్షించమని చెప్పగా... అతడు కూడా విగ్రహానికి ప్రాణం ఉండదు కదా అంటూనే, పరీక్షించి నాడి చప్పుడు లేదని చెప్తాడు. అప్పుడు మౌనస్వామి విగ్రహానికి ప్రాణ ప్రతిష్ట చేసి ఇప్పుడు చూడండి అని చెప్పగా, స్టైతస్కోప్ తో పరిశీలించగా ఆ వైద్యుడిలో ఒక ఆశ్చర్యం గణపతి విగ్రహానికి మనిషి వలె నాడి కొట్టుకుంటుందని చెప్పాడు.

దీంతో ఈ అద్భుతాన్ని చూసిన ఆ వైద్యుడు ఇంకా బ్రిటిష్ గవర్నర్ మౌనస్వామి దగ్గర ఆశీర్వాదాన్ని తీసుకొని గణపతికి నమస్కరించి అక్కడి నుండి వెళ్లారు. ఇలా మౌనస్వామి మహిమతో ఇక్కడ వెలసిన గణపతి దేవుడికి నాడి గణపతి అనే పేరు వచ్చినది.

అయితే ఇక్కడ స్వామివారి తొడల నుండి శబ్దం వచ్చినదని అందుకే స్వామివారి విగ్రహానికి తొడలు కనిపించకుండా ధోవతి కడతారు.

## తెదేపా అనకాపల్లి జిల్లా కార్యాలయంలో విజయోత్సవ వేడుకలు





**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ బలపరిచిన అభ్యర్థి వేపాడ చిరంజీవి రావు విజయ పదంలో దూసుకుపోతున్నందుకు తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా విజయోత్సవ వేడుకలను నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ నాయకులకు కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేసి బాణాసంచారం వెలిగించి కేరింతలతో ఆనందోత్సవాల్లో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగ జగదీష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి బూతుల మంత్రులు ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీ వైసీపీ పార్టీ నాయకులు తెలుగుదేశం పార్టీ పని అయిపోయిందని బంగాళాఖాతంలో కలిపేసామని ప్రగల్బాలు పలికిన వారందరికీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉత్తరాంధ్ర పట్టభద్రులు బుద్ధి చెప్పే విధంగా తీర్పునిచ్చారని నాగ జగదీష్ ఘాటుగా వైసీపీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ముఖ్యంగా విశాఖపట్నానికి తీరని అన్యాయం చేశారని విభజన చట్టంలో రావలసిన నిధులు గురించి గానీ, వాల్తేరు డివిజన్ తో కూడిన రైల్వే జోన్ ప్రత్యేక హోదా వస్తే నిరుద్యోగ సమస్య తీరుతుందని నిరుద్యోగులకు ఆశలు కల్పించి వైసీపీ ప్రభుత్వం వస్తే 2 లక్షల 30000 ఉద్యోగాలు యువతకి ఇస్తామని మోసం చేసిన విషయాన్ని గ్రహించిన పట్టభద్రులు ఈ ఎన్నికల్లో వైసీపీకి చెంప దెబ్బ కొట్టారని ఉత్తరాంధ్ర వెనుకబడిన ప్రాంతాల నిధులు గురించి గానీ, విశాఖకు పెట్రోలియం యూనివర్సిటీ, విజయనగరం జిల్లా గిరిజన యూనివర్సిటీ, పోలవరం ఎడమ కాలువ, సృజల స్రవంతి ప్రాజెక్టుకు తీరని అన్యాయం చేశారని గంగవరం పోర్టు 32 వేల కోట్లు విలువైన ప్రభుత్వ ఆస్తిని అదానీకి 646 కోట్లకు అమ్మి వేశారని విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ను కేంద్రంపై ఒత్తిడి తీసుకురాకుండా ద్వంద వైఖరి వహించారని విశాఖ కే జి హెచ్ కలెక్టర్ ఆఫీస్ తహసిల్దార్ ఆఫీస్ విలువైన ప్రభుత్వ భూములను తాకట్టు పెట్టి అప్పులు చేసుకున్నారని, ఇక సన్న కారు చిన్న కారు ఎస్సీ బీసీ పేద వర్గాల భూములను బిల్డ్ ఏపీ పేరుతో దోచుకున్నారని ప్రశాంతమైన విశాఖపట్నం రౌడీయిజం గుండాయిజం హత్యలు,మానభంగాలు, దొంగతనాలు, దోపిడీలు పెరిగిపోయిన విషయాన్ని ఓటర్లు గ్రహించి పట్టభద్రులైన విద్యావంతులు ఉద్యోగులు ఉపాధ్యాయులు యువతీ యువకులు సరైన నిర్ణయం తీసుకొని ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పారని అత్యధిక మెజార్టీతో తెలుగుదేశం అభ్యర్థిని గెలిపించిన ఓటరు మహాశయులందరికీ కృతజ్ఞతాభినందనలు నాగ జగదీష్ తెలియజేశారు. సురేష్ సతీష్ డాక్టర్ నారాయణరావు మాదంశెట్టి నేల బాబు బోడు వెంకటరావు కుప్పిలి జగన్మోహన్ కోటిని రామకృష్ణ కోటి రాంబాబు తలారి లక్ష్మీ ప్రసాద్ దొడ్డి జగదీష్ బొడ్డేడ మురళి మల్ల గణేష్ దూలం ప్రసాద్ సిమ్మేటి రామకృష్ణ బెల్లాన్ శ్రీనివాసరావు వానపల్లి కోటేశ్వరరావు ఎమ్మెల్యే రమణ బర్నికారుల శ్రీనివాసరావు విల్లూరి రమణబాబు బుద్ధ భువనేశ్వర్ నాదముని పనింద్ర మల్ల శివన్నారాయణ బుద్ధ విశ్వనాథం పెంటకోట వరప్రసాద్ పేలా శ్యాము సూరిశెట్టి బల్లమ్మ కర్రి మల్లేశ్వరరావు కర్మిశెట్టి నర్సింగరావు మురళి పాలిమేర నాయుడు పెంట కోట శివరామ విల్లూరి సత్తిబాబు కొణతాల బాల ఎలమంచిలి బంగారు రాజు వానపల్లి త్రినాధ్ బం డి అప్పారావు మారిశెట్టి శంకర్రావు తిప్పన అప్పారావు జరగడం శాంతారావు తేలపోలు గోవిందరావు సింగంపల్లి ప్రసాదరావు ఏదురిని నూక అప్పారావు సాలాబ్ మధు కొయ్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి ఉత్తరాంధ్ర మంత్రులకు ఓటర్లు తగిన బుద్ధి చెప్పారు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార వైసిపి పార్టీకి పట్టభద్రులు ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు ముఖ్యంగా జగన్ మోహన్ రెడ్డికి ఉత్తరాంధ్ర సామంత రాజు వై వి సుబ్బారెడ్డి కి మంత్రి గుడివాడ అమర్నాథ్ కు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు అధర్మమే రాజ్యం మేలుతుందని చెప్పిన ధర్మాన ప్రసాదరావుకు, పశువుల మంత్రి సిదర అప్పలరాజు నోటు దురుసుకు ఉత్తరాంధ్ర ఓటర్లు బుద్ధి చెప్పారని అనకాపల్లి పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ కొణతాల వెంకటరావు ఘాటుగా విమర్శించారు. 2019 జనరల్ ఎన్నికల నుండి పంచాయితీ, ఎంపీటీసీ, జడ్పిటిసి, కార్పొరేషన్ ఎన్నికల్లో అధికార దుర్వినియోగం చేస్తూ పోలీసులను అడ్డం పెట్టుకొని గెలిచినప్పటికీ సొంత పార్టీ ఎన్నికైన సభ్యులు తిరిగిబాటు చేసే పరిస్థితి వచ్చిందని అయినప్పటికీ ప్రభుత్వంలో చలనం లేదని ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా అర్హత లేని వ్యక్తులను ఓటర్లుగా చేర్చి లబ్ది పొందాలని చూసినప్పటికీ, డబ్బును విచ్చలవిడిగా సచివాలయం సిబ్బంది ద్వారా పంపిణీ చేసినప్పటికీ ఓటర్లు లొంగలేదని ఉత్తరాంధ్రకు వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలను సాగునీరు ప్రాజెక్టులు, ప్రత్యేక హోదా, రైల్వే జోన్, వెనుకబడిన ప్రాంతాల నిధులు సాధించడంలో విఫలమైందని , విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలో ద్వంద వైఖరి ని, గంగవరం పోర్టు అమ్మి వేయడం, ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని రాజకీయ వేదికగా మార్చిన విషయాన్ని, విశాఖపట్నం ప్రశాంతమైన వాతావరణం కలుషితం చేసి , రాజకీయంగా గుండాయిజం రౌడీయిజం దోపిడీలు భూ కబ్జాలు, వంటివి ప్రోత్సహించరని ఇటువంటి చర్యల మూలంగా ప్రజలు విసిగి చెందారని అన్నారు. జగన్ రెడ్డి ప్రభుత్వం ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టడం రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీయడం వంటి చర్యలను గమనించిన పట్టభద్రులు వైసీపీకి బుద్ధి చెప్పాలని కృత నిశ్చయంతో తెలుగుదేశం పార్టీ బలపరిచిన విద్యావంతుడు మేధావి వర్గానికి చెందిన వ్యక్తి వేపాడు చిరంజీవిరావుపై నమ్మకంతో ఓట్లు వేసి అత్యధిక మెజార్టీ దిశగా విజయం సాధిస్తున్నందుకు ఓట్లు వేసిన పట్టభద్రులకు, వారి కుటుంబ సభ్యులకు తెలుగుదేశం పార్టీ కృతజ్ఞత అభినందనలు తెలియజేస్తూ తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని వెంకటరావు తెలియజేశారు.

## 3 కోట్లు విలువచేసే చేసే గంజాయి పట్టివేత



**చింతపల్లి, (విశాఖ సమాచారమ్):** పోలీసులకు అందిన విశ్వనీయ సమాచారం మేరకు ఈరోజు ఉదయం 7 గంటల సమయంలో. చింతపల్లి పెంటపాడు గ్రామం జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీల్లో చేయుచుండగా భారీగా పట్టుబడిన గంజాయి.

పోలీసుల తనిఖీలు చేస్తుండగా అటుగా వస్తున్న వాహనం , ఎంహెచ్ 48 ఎవై 4379 గల వాహనం పోలీసు వారిని చూసి రహదారిపై వాహనం నిలుపుదల చేసి అందులో నుంచి ముగ్గురు వ్యక్తులు దిగి పారిపోతుండగా ఎస్సై తమ సిబ్బందితో వారిని పట్టుకుని వారి యొక్క వాహన తనిఖీ చేయగా వాహనంలో బియ్యం బస్తాలు చాటున 1700 కిలోల గంజాయి దొరికినది గంజాయి విలువ సుమారుగా మూడు కోట్లు ఉంటుందని అంచనా.

ఈ గంజాయిని దారకొండ సరిహద్దుల్లోని ఒడిశా గ్రామంలో సీతారాం అతని స్నేహితుడు మహారాష్ట్రకు చెందిన గంజాయి వ్యాపారులకు సరఫరా చేయుచున్నట్లు ఈ క్రమంలో పోలీసు వారికి పట్టుబడిన సదరు వాహన డ్రైవర్ చేయుచున్న ఫేక్ యాదవ్ మరియు రవీంద్ర యాదవ్ చెప్పారు.

ఈ గంజాయి సమాచారాన్ని ముందుగా సేకరించిన సీఐ రమేష్ . ఎస్సై అరుణ్ కిరణ్. ముద్దాయిలను కోవడంలో కృషి చేసిన సిబ్బందిని . అల్లూరు జిల్లా ఎస్పీ. సతీష్ కుమార్ మరియు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ తుహిన్ సింహ. చింతపల్లి అడిషనల్ ఎస్పీ శ్రీ ప్రతాప్ శివ కిషోర్ ప్రత్యేకంగా అభినందించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా ఇకమీదట ఎవరైనా గంజాయి రవాణా చేసిన ప్రత్యేక నిఘ పెట్టమని గంజాయి సరఫరా చేసే వ్యక్తులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని అడిషనల్ ఎస్పీ అడ్మిన్ తుహిన్ సింహ హెచ్చరించారు.

## ఏపి పిజిసెట్ కార్యాలయం ప్రారంభం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** రాష్ట్ర వ్యాప్తంగా పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఏపి పిజిసెట్ కార్యాలయాన్ని ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఉదయం ప్రారంభించారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి సమక్షంలో ఇంచార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిషోర్ బాబు చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం కన్వీనర్ ఆచార్య ఎన్.రమణయ్యకు వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ప్రభుత్వం అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, ప్రిన్సిపాల్స్ ఆచార్య వై.రాజేంద్ర ప్రసాద్, టి.శోభశ్రీ, జి.శశిభూషణ రావు, ఎస్.కె భట్టి, వి.విజయలక్ష్మి, డీన్ ఆచార్య భాస్కర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి అమర్నాథ్ తీరు కార్పొరేటర్ తక్కువ మంత్రి పదవికి ఎక్కువ



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** మంత్రి అమర్నాథ్ కార్పొరేటర్ కి తక్కువ మంత్రి పదవికి ఎక్కువ అన్నట్టుగా ఆయన మాట్లాడే తీరు ఉందని జనసేన అనకాపల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ పరుచూరు భాస్కరరావు అన్నారు. శుక్రవారం ఇక్కడ బైపాస్ రోడ్ లో ఉన్న జనసేన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించి చట్టసభలలో సంతకం చేస్తామని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అన్న మాటలను వక్రీకరించి అర్థం లేని విమర్శలను మంత్రి అమర్నాథ్ చేస్తున్నారని భాస్కరరావు మండిపడ్డారు. చట్ట సభల్లో సంతకం చేసి తీరుతామనీ పవన్ కళ్యాణ్ ప్రకటించగా ఇప్పుడు వస్తే చట్టసభలకు పాసులు ఇస్తామని మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని ఆయన అన్నారు . మచిలీపట్నంలో ఇటీవల జరిగిన పవన్ కళ్యాణ్ పర్యటన చూసి వైసిపి నాయకుల గుండెల్లో అలజడి ప్రారంభమైందని ఆయన అన్నారు. సినిమా యాక్టర్ కాబట్టి చూసేందుకు జనం వస్తున్నారని విమర్శలు చేయడం తగదని, ఎన్టీఆర్ తర్వాత ప్రభంజనం సృష్టించగల నాయకునిగా పవన్ కళ్యాణ్ కు జనం బ్రహ్మరథం పడుతున్నారని ఆయన అన్నారు. జగన్మోహన్ రెడ్డిని బటన్ రెడ్డి గా అభి వర్ణిస్తూ జగన్ సభలు ప్రారంభం అయిన వెంటనే సగం కుర్చీలు ఖాళీ అని ఆయన విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో 175 కు175 సీట్లు మావేనని గొప్పల చెబుతున్న వైసిపికి నేడు జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు భవిష్యత్తు ఫలితాలకు నాంది పలుకుతాయని ఆయన అన్నారు. వచ్చే ఎన్నికల్లో 151 సీట్లు కాదు కదా 15 సీట్లు మించి రావని ఆయన జోస్యం చెప్పారు. తాము ఒంటరిగా పోరాటం చేయాలా లేదా పొత్తులతో ఎన్నికల బరిలో దిగాలనేది పార్టీ సొంత నిర్ణయం అని పదేపదే ఒంటరిగా 175 సీట్లు పోటీ చేయాలని వైకాపా మంత్రులు ప్రకటనలు చేయడం పద్ధతి కాదన్నారు. రాష్ట్రంలో జరిగిన పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో మూడింట రెండు తెలుగుదేశం కైవసం చేసుకోవడం చూసి అయినా వైకాపా నేతలు లేనిపోని గాంభీర్యాన్ని ప్రకటిస్తూ జనసేనపై, ప్రతిపక్షాలపై విమర్శలు చేయడం మానుకోవాలని అన్నారు. అమర్నాథ్ ఇప్పటికైనా ప్రజలకు మేలు చేసే పనులు చేసి ప్రజల మన్ననలు పొందాలన్నారు. ముఖ్యమంత్రి వద్ద మన్ననలు పొందేందుకు ప్రతిపక్షాలపై లేనిపోని విమర్శలు చేయడం తగదు అన్నారు. సమావేశంలో జనసేన నాయకులు పావాడ కామరాజు, ముత్తాడ రామరాజు , కోట్ని సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ధ్యాన ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** జిల్లాకోర్టు దరి బానోజినగర్లో వెంచేసియున్న శ్రీ ధ్యానఆంజనేయ స్వామి వారి ఆలయంలో స్వామివారికి ప్రీతికరమైన మంగళవారం పురస్కరించుకొని ఆలయ అర్చకులు సత్య జగన్నాథశర్మ సింధూరం తమలపాకులతో అర్చన ప్రత్యేక పూజలు పేరు గోత్రనామాలతో నిర్వహించారు తదుపరి భక్తులచే నిమ్మకాయల దీపాలను వెలిగింపచేసి అనంతరం ధూప దీప నైవేద్యం దివ్య మంగళహారతి మంత్రపుష్పం సమర్పించారు కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం వి రాజశేఖర్ భక్తులు పరిసర ప్రాంత వాసులు పాల్గొన్నారు.

## ఆస్తి మరియు ఖాళీ స్థలాల పన్నుపై వడ్డీ మాఫీ

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం జి.ఓ.ఎం.యస్. నెం. 34 ఎం. ఏ. తేది.16-03-2023 ఉత్తర్వుల మేరకు రాష్ట్రంలో అన్ని నగరపాలక మరియు పురపాలక సంఘాలలో ఆస్తి మరియు ఖాళీ జాగా పన్నుల విషయంలో ఈ ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న బకాయిలు మరియు ఈ ఆర్థిక సంవత్సరం పన్ను పై విధించిన వడ్డీని వన్ టైమ్ మెజర్ గా మాఫీ చేయడం జరిగినది. అయితే, పన్ను చెల్లించవలసిన పన్ను చెల్లింపుదారులు బకాయి ఉన్న మొత్తాన్ని ఈ ఆర్థిక సంవత్సరం తో సహా ఒకే సారి తేది. 31-03-2023 లోపు చెల్లించినట్లైతేనే ఈ వడ్డీ మినహాయింపు వర్తిస్తుంది. ఆస్తి పన్ను చెల్లింపుదారులు, ఈ యొక్క సదవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వడ్డీ మినహాయింపు లబ్ధిని పొంది మీ యొక్క ఆస్తి మరియు ఖాళీ జాగా పన్ను బకాయిలని వడ్డీ లేకుండా ఒకే సారి తేది. 31-03-2023 లోపు చెల్లించవలసినది గా విజ్ఞప్తి.

**ఆస్తి మరియు ఖాళీ జాగా పన్ను చెల్లింపు విధానం**

అంతే కాకుండా పన్నులను ఆన్-లైన్ ద్వారా (https://cdma.ap.gov.in/) నెట్-బ్యాంకింగ్ ద్వారా కానీ, డెబిట్ / క్రెడిట్ కార్డు ల ద్వారా కానీ, UPI ద్వారా కానీ చెల్లించవచ్చు

ఈ సదవకాశం తేది. 31-03-2023 వరకు మాత్రమే. కావున త్వరపడండి. మీ బకాయిల మొత్తాన్ని వెంటనే చెల్లించి, వడ్డీ మాఫీ లబ్ధిని పొందాలని మున్సిపల్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై. శ్రీలక్ష్మి తెలిపారు.

# ఛలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** రాష్ట్ర ముఖ్యమంత్రి అంగన్వాడి వర్కర్స్ కు ఎన్నికల పూర్వం ఇచ్చిన హామీల అమలుకై మార్చి 20వ తేదీన జరుగు చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అంగన్వాడి వర్కర్స్ యూనియన్ పార్వతీపురం మన్యం జిల్లా నుండి ప్రతి టీచర్ మరియు హెల్పేర్స్ అందరూ సెంటర్స్ మూసివేసి ధర్నా లో పాల్గొనాలని పిలుపు నివ్వడం జరిగింది. ప్రభుత్వము అంగన్వాడి వర్కర్స్ కు అనేక వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలు పూర్తి అవుతున్న ఏ ఒక్క వాగ్దానాన్ని నెరవేర్చలేదు. అంగన్వాడీలకు గ్రాట్యుటి అమలు చేయాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదు. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ అమలుకు బిల్లులు సక్రమంగా చెల్లించడం లేదు. అంగన్వాడీలు అప్పు చేసి సెంటర్లు నడపాల్సిన పరిస్థితి వచ్చింది. గత ఐదు సంవత్సరాలుగా %ూా% లు చెల్లించడం లేదు.రకరకాల యాప్ ల ను తీసుకొని వచ్చి పని భారాన్ని పెంచారు అంగన్వాడీలకు ఇచ్చిన సెల్ ఫోన్లు పనిచేయడం లేదు. అంగన్వాడీలకు తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు ఇస్తామని చెప్పిన ముఖ్యమంత్రి నేటికీ చెల్లించడం లేదు. సెంటర్లను బలోపేతం చేయడానికి నిధులను పెంచి అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని అంగన్వాడీలు మానసిక ఒత్తిడికి గురై అనారోగ్య పాలవుతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఏ ఒక్కటి అంగన్వాడి వర్కర్స్ అమలు కావడం లేదు. అంగన్వాడీలకు ఫేస్ యాప్ రద్దు చేయాలి.... పర్యవేక్షణ పేరుతో వేధింపులు ఆపాలి. వైయస్సార్ సంపూర్ణ పోషణ మెను చార్జీలు పెంచాలని ,గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని . 2017 సంవత్సరం నుండి పెండింగ్లో ఉన్న టీఏ లను వెంటనే చెల్లించాలి. లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారం అందించాలి ఆయిల్ కందిపప్పు క్వాంటిటీ పెంచాలి.వేతనంతో కూడిన మెడికల్ లీవులు ఇవ్వాలి.సర్వీస్ లో ఉండి చనిపోయిన కుటుంబాలకు ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి. అమలు చేయాలి రాజకీయ వేధింపులు లేకుండా చూడాలని వయస్సుతో నిమితంలేకుండా సూపెర్వైజర్ పోస్టులు భర్తీచేయాలని.వయోపరిమితి తొలగించాలని,ఇతర డిమాండ్స్ సాధన కై మార్చి 20నవిజయవాడలో జరిగే మహా ధర్నాను జయప్రదం చేయాలని, అందరు పాల్గొని జయప్రదం చేయాలనికోరుచున్నాము.అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పేర్స్ యూనియన్ పార్వతిపురం మన్యం జిల్లాజిల్లా ప్రధాన కార్యదర్శి అధ్యక్షులు ఎం ఉమామహేశ్వరి జిల్లా ప్రధాన కార్యదర్శి గంట జ్యోతిలక్ష్మి అంగన్వాడి వర్కర్స్ రాజేశ్వరి పార్వతి విజయలక్ష్మి గౌరీ మని పోస్టర్ ఆవిష్కరణ చేశారు.

# సీజనల్ వ్యాధులు పట్ల అప్రమత్తం గా ఉండాలి



**పార్వతీపురం/బాలగుడబ, (విశాఖ సమాచారమ్):** సీజనల్ వ్యాధులు పట్ల అప్రమత్తం గా ఉండాలని జిల్లా వైద్య అధికారి బి.జగన్నాథం రావు బందలుప్పి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తిరుమల ప్రసాద్ అన్నారు. పార్వతీపురం మండలం బాలగుడబ గ్రామంలో నిర్వహిస్తున్న డ్రై డే, ఫ్రై దే కార్యక్రమం సందర్శించారు. ఈ మేరకు ఆయన పలు ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఇందులో భాగంగా మురికి కాలువలను శుభ్రపరచాలని , నీరు నిలవ లేకున్నా ఉండాలని చెప్పారు. అదే విధంగా బాలింతలను ,గర్భవతి ఇల్లు సందర్శించారు వాళ్ళకి ఐరన్ టాబ్లెట్ క్యాల్షియం టాబ్లెట్ వాటి వల్ల ఉపయోగాలు తెలిపి వివరించారు. తప్పనిసరిగా ఉపయోగించాలని. తగు జాగ్రత్తలు తీసుకోవాలి అని సూచించారు. ఐదో నెల దాటిన గర్భవతులకు టాబ్లెట్ అల్బెండజోల్ వేసుకోవాలని సూచించారు.మరియు దీర్ఘకాలిక వ్యాధులు సీజనల్ వ్యాధులు వివరాలు అడిగి తెలుసుకున్నరు వ్యక్తిగత పరిశుభ్రత,పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించారు.గ్రామాలలో ఉన్న తాగు నీటివనరుల వద్ద,ట్యాంక్ లు, బోరుబావులు, కాల్వలు ఎప్పటికప్పుడు పరి శుభ్రం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బి. పోలమ్మ, సిహెచ్ఓ జగదీష్ కుమార్, రామలక్ష్మి మరియు ఆశ, సి హెచ్ డబ్ల్యూ లు పాల్గొన్నారు

# వైసీపీ ఎంపీ అవినాశ్‌రెడ్డికి తెలంగాణ హైకోర్టులో చుక్కెదురు



**హైదరాబాద్:** వైఎస్ వివేకా హత్య కేసులో వైసీపీ ఎంపీ అవినాశ్‌రెడ్డికి తెలంగాణ హైకోర్టులో చుక్కెదురైంది. అవినాశ్‌రెడ్డి మధ్యంతర పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. సీబీఐ అరెస్ట్ చేయకుండా ఆదేశించాలని ఎంపీ అవినాశ్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టేసింది. తన విచారణపై స్టే ఇవ్వాలని అవినాశ్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టేయడంతో అవినాష్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలినట్టయింది. సీబీఐ విచారణకు సహకరించాలని అవినాశ్‌రెడ్డికి హైకోర్టు ఆదేశాలివ్వడం గమనార్హం. అరెస్ట్ చేయొద్దని తాము చెప్పలేమని అవినాష్ రెడ్డికి హైకోర్టు ధర్మాసనం తేల్చి చెప్పింది. దర్యాప్తు కొనసాగించవచ్చని సీబీఐకి హైకోర్టు అనుమతి ఇచ్చింది.విచారణ ఆడియో, వీడియో రికార్డ్ చేయాలని హైకోర్టు ఆదేశించింది. ఇదిలా ఉండగా.. బాబాయ్ వివేకానంద రెడ్డి హత్య కేసు దర్యాప్తులో సీబీఐ దూకుడు పెంచుతూ.. తమ్ముడు, ఆత్మీయుడైన ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి చుట్టూ ఉచ్చు బిగిస్తున్న సమయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అకస్మాత్తుగా ఢిల్లీకి పయనమయ్యారు.

# రీసర్వే ద్వారా భూ సమస్యలకు పరిష్కారం



**విజయనగరం:** జగనన్న శాశ్వత భూ హక్కు మరియు భూ రక్ష పథకం క్రింద చేపట్టిన భూ సర్వే ద్వారా, వివిధ రకాల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి అన్నారు. చీపురుపల్లి మండలం రావివలస, మెరకముడిదాం మండలం భైరిపురం గ్రామాల్లో ఆమె శుక్రవారం పర్యటించారు. రీ సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఆయా మండలాల్లో ఇప్పటివరకు నిర్వహించిన భూముల రీసర్వే వివరాలను, తాశిల్దార్లు కలెక్టర్‌కు వివరించారు. ఇప్పటివరకు జరిగిన డ్రోన్ సర్వే, రికార్డుల్లో నమోదు తదితర అంశాలపై కలెక్టర్ ప్రశ్నించారు. రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేసి, నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వే చేయడమే కాకుండా, ఎప్పటికప్పుడు రికార్డుల్లో వివరాలను నమోదు చేయాలని సూచించారు. రికార్డులు అత్యంత ఖచ్చితంగా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పర్యటనలో చీపురుపల్లి తాశిల్దార్ ఎం.సురేష్, మెరకముడిదాం తాశిల్దార్ బి.రత్నాకర్, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

**ప్రభుత్వ భవనాలను త్వరగా పూర్తిచేయాలి**

గ్రామంలో చేపట్టిన ప్రభుత్వ భవనాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. చీపురుపల్లి మండలం రావిలస గ్రామ సచివాలయాన్ని ఆమె శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా సిబ్బంది హాజరును, రికార్డులను తనిఖీ చేశారు. సఖి కార్యక్రమం, వివిధ ప్రభుత్వ పథకాల అమలు, గర్భిణులకు, పిల్లలకు రక్త పరీక్షలు, పోషకాహార పంపిణీ గురించి తెలుసుకున్నారు. సఖి గ్రూపు సభ్యులను మరింత చైతన్యవంతం చేయాలని సూచించారు. గృహనిర్మాణ కార్యక్రమంపై ఆరా తీశారు. ఇళ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేసి, ఉగాది నాటికి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని సూచించారు. గ్రామంలో పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలన్నారు. గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం తదితర ప్రభుత్వ భవనాల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# విశాఖ ఏఎంసీలో భారీగా పెరిగిన మెడికల్ పిజి సీట్లు

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆంధ్రా మెడికల్ కాలేజిలో మెడికల్ పీజి సీట్లను ప్రభుత్వం భారీగా పెంచింది. సిటి సర్జరీలో 4 సీట్లు, డివిఎల్ లో 7 నుంచి 10, ప్రసూతి విభాగంలో 26 నుంచి 37, పెథాలజీలో 5 నుంచి 12, సైకాలజీలో 5 నుంచి 12, న్యూరాలజీలో 3 నుంచి 5, సర్జరీలో 19 నుంచి 26, కమ్యూనిటీ మెడిసిన్ లో 6 నుంచి 12 సీట్లుకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఏఎంసీ ప్రిన్సిపాల్ డా.బి.బుచ్చిరాజు తెలియజేశారు.

ఈ మేరకు విశాఖలో మీడియాకి ప్రకటన విడుదల చేశారు. పెరిగిన సీట్లకు అనుగుణంగా కౌన్సిలింగ్ లో పిజి విద్యార్థులకు సీట్లు కేటాయిస్తామని ఆయన తెలియజేశారు.

# సుప్రీంకోర్టులో ఎమ్మెల్సీ కవిత కు ఎదురుదెబ్బ



**న్యూఢిల్లీ:** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తన పిటిషన్‌ను త్వరగా పరిష్కరించాలన్న కవిత అభ్యర్థనను సుప్రీం తిరస్కరించింది. ఈనెల 24నే విచారిస్తామని ఉన్నతన్యాయస్థానం తేల్చిచెప్పింది. ఈడీ తనను విచారణకు పిలవడాన్ని సవాల్ చేస్తూ కవిత సుప్రీంలో పిటిషన్ దాఖలు చేయగా... 24న విచారిస్తామని కోర్టు తెలిపింది. నిన్నటి (మార్చి 16న) ఈడీ విచారణకు కవిత గైర్హాజరయ్యారు. దీంతో ఈనెల 20న విచారణకు రావాలని కవితకు ఈడీ నోటీసులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో 20 తేదీలోపే తన పిటిషన్‌పై విచారణ జరపాలని మరోసారి సుప్రీంకోర్టును కవిత అభ్యర్థించింది. అయితే కవిత పిటిషన్‌ను తాము ముందు చెప్పిన విధంగా 24నే విచారిస్తామని.. దాంట్లో ఎలాంటి మార్పు లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

ఈడీ అధికారులు మార్చి 20న సోమవారం తమ కార్యాలయానికి వ్యక్తిగతంగా హాజరు కావాల్సిందేనని కవితకు మరోమారు నోటీసులు పంపిన సంగతి తెలిసిందే. ఈ నెల 24న సుప్రీంకోర్టులో తన పిటిషన్ విచారణ జరిగేంత వరకూ ఆగాలని కవిత చేసిన అభ్యర్థనను ఈడీ తోసిపుచ్చింది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన అరుణ్ రామచంద్ర పిళ్లైని గురువారం ప్రత్యేక కోర్టు ముందు ప్రవేశపెట్టిన ఈడీ ఆయనను కవితతో కలిపి ముఖాముఖి ప్రశ్నించాల్సి ఉందని తెలిపింది. దీంతో ప్రత్యేక న్యాయస్థానం అరుణ్ పిళ్లై కస్టడీని మార్చి 20 వరకు పొడిగించింది. మార్చి 20న ఉదయమే కవిత-అరుణ్ పిళ్లైల మధ్య ముఖాముఖి సమావేశం ఏర్పాటు చేసి, వాస్తవాలు రాబట్టుకునేందుకు ఈడీ రంగం సిద్ధం చేసిందని, కవిత ఈడీ దర్యాప్తు నుంచి తప్పించుకునే అవకాశాలు లేవని దీన్ని బట్టి స్పష్టమవుతోంది. కాగా, కవిత రెండు రోజుల క్రితమే ఈడీకి లేఖ రాసి సిద్ధంగా ఉంచారని, సాధ్యమైనంత వరకు ఈడీ దర్యాప్తు తప్పించుకోవాలని ఆమె ప్రయత్నిస్తున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఒకవేళ కవిత విచారణకు సహకరించకపోతే ఈ దఫా విచారణ తర్వాత ఆమెను అరెస్టు చేసే అవకాశాలున్నాయని అధికార వర్గాలు అంటున్నాయి.

# వెహికల్ ఇన్‌స్పెక్టర్‌కు ఎస్పీ పరామర్శ



**కాకినాడ, (విశాఖ సమాచారమ్):** విధి నిర్వహణలో దాడికి గురై, ప్రాణాపాయస్థితిలో, కాకినాడ జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శ్రీ మిద్దే చిన్నారావు మరియు డ్రైవర్ గుత్తుల వీర వెంకట సత్యనారాయణలను పరామర్శించిన కాకినాడ జిల్లా ఎస్పి ఎం. రవీంద్రనాథ్ బాబు. శుక్రవారం ఉదయం సుమారు 8:15 గంటల ప్రాంతంలో వ్యాన్ పై కొబ్బరి బొండాలు అమ్ముతున్నటువంటి పెంటా వెంకట దుర్గాప్రసాద్ అనే వ్యక్తి వద్దకు చెకింగ్ లో భాగంగా వ్యాన్ రికార్డుల గురించి, వ్యాన్ ఫిట్నెస్ సర్టిఫికెట్ మరియు ఇన్సూరెన్స్ వివరాలు గురించి అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శ్రీ ఎం. చిన్నారావు గారు తనిఖీ సమయంలో అడుగుతుండగా ఘర్షణ జరిగింది.

ఆ సమయంలో కొబ్బరి బొండాలు అమ్మే పెంటా వెంకట దుర్గా ప్రసాద్ కొబ్బరి బోండాల కత్తితో అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ చిన్నారావుని, వారి డ్రైవర్ గుత్తుల వీర వెంకట సత్యనారాయణ లను నరకడం జరిగింది. ఘటన జరిగిన కొద్ది నిమిషాల్లోనే పోలీసు అధికారులు అక్కడకు చేరుకోవడం జరిగింది.

ముద్దాయిని అదుపులో తీసుకొని గాయపడినటువంటి అసిస్టెంట్ మోటర్ ఇన్స్పెక్టర్ చిన్నారావు, వారి డ్రైవర్ గుత్తుల వీర వెంకట సత్యనారాయణలను కాకినాడ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ చికిత్స నిమిత్తం తరలించడం జరిగింది.

కాకినాడ జిల్లా ఎస్పి ఎం.రవీంద్రనాథ్ బాబు, కాకినాడ జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న వారిద్దర్నీ పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిపై జి.జి.హెచ్. సూపరింటెండెంట్‌తో చర్చించి, అనంతరం ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్.పి. గారితో పాటు కాకినాడ డి.ఎస్.పి. శ్రీ పి. మురళీకృష్ణ రెడ్డి, I టౌన్ ఇన్స్పెక్టర్ వి. కృష్ణ, జిల్లా ట్రాన్స్పోర్ట్ డిపార్టుమెంటు కు చెందిన అధికారులు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.




# ఇసుక కొరత ఉండరాదు



పార్వతీపురం, (విశాఖ సమాచారమ్): జిల్లాలో ఇసుక కొరత ఉండరాదని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. ఇసుక పరిస్థితిపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ప్రభుత్వ భవనాల నిర్మాణానికి ముఖ్యంగా ప్రాదాన్యత పనుల నిర్మాణానికి ఇసుక కొరత తలెత్తరాదని ఆయన చెప్పారు. కొన్ని ఇసుక రీచ్ లను ప్రత్యేకంగా కేటాయించడం వలన సమస్య ఉండదని ఆయన సూచించారు. వివిధ ఇసుక రీచ్ లలో ఉన్న నిల్వలపై పక్కాగా అంచనాలు వేయాలని, పర్యావరణ అనుమతులకు దరఖాస్తులు చేయాలని ఆయన స్పష్టం చేశారు. వర్షాకాలంలో పనులు చేయుటకు ఇసుక కొరత లేకుండా ముందుగా నిలువ చేయాలని సూచించారు. నిలువ చేయుటకు సరైన ప్రదేశాలు గుర్తించాలని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో గనులు, భూగర్భ శాఖ ఉప సంచాలకులు చంద్ర నాయక్, సహాయ సంచాలకులు మల్లేశ్వర రావు, జిల్లా భూగర్భ జల అధికారి ఏ. రాజశేఖర రెడ్డి, జిల్లా గ్రామ పంచాయితీ అధికారి బలివాడ సత్యనారాయణ, కాలుష్య నియంత్రణ మండలి ఇఇ ఎస్. శంకర నాయక్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఎం. శశి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## స్పీకర్, తమ్మినేని మర్యాద పూర్వకంగా కలిసిన పార్వతీపురం ఎమ్మెల్యే



పార్వతీపురం, (విశాఖ సమాచారమ్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏపీ అసెంబ్లీ సమావేశాలలో గత నాలుగు రోజులుగా పాల్గొంటు వస్తున్న పార్వతీపురం నియోజకవర్గం శాసనసభ్యులు అలజంగి జోగారావు ఈరోజు అసెంబ్లీ సమావేశాలలో పాల్గొని ఉదయం సేసన్స్ లో రాష్ట్ర ప్రభుత్వం ఎస్సి, ఎస్టీ లకు చేసిన అభివృద్ధి అంశంపై ప్రసంగించిన అనంతరం బోజన విరామం సమయంలో శాసనసభ స్పీకర్ తమ్మినేనీ సీతారాం ని వారి ఛాంబర్ లో మర్యాద పూర్వకంగా కలుసుకోవడం జరిగినది. అలానే రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మాత్యులు మేరుగ నాగార్జున నీ వారి ఛాంబర్లో మర్యాద పూర్వకంగా కలుసుకుని పలు అంశాలపై చర్చించడం జరిగింది. ఈ మర్యాద పూర్వక భేటీలో ఎమ్మెల్యే స్పీకర్ మంత్రితో నియోజకవర్గ అభివృద్ధిపై కాసేపు చర్చించడం జరిగింది. ఈ భేటీలో ఎమ్మెల్యే వెంట ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు సామల సింహాచలం వెంట పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా శశిభూషణ రావు



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆచార్య జి.శశిభూషణ రావు నియమితులయ్యారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి నుంచి నియామక ఉత్తర్వులను ఆయన స్వీకరించారు. అనంతరం ప్రిన్సిపాల్‌గా బాధ్యతలను స్వీకరించారు. ఆచార్య శశిభూషణ రావును ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత, ఇంచార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిషోర్ బాబులు అభినందించారు.

## 18 నుంచి హనుమాన్ చాలీసా పారాయణం



కాచిగూడ: తిరుమలలోని నాదనీరాజన మండపంలో ఈ నెల 18 నుంచి 24 గంటల పాటు నిర్విరామ హనుమాన్ చాలీసా పారాయణాన్ని నిర్వహిస్తున్నట్లు భాజపా మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు గీతామూర్తి తెలిపారు. యుగ తులసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో పాల్గొనడానికి గురువారం రాత్రి కాచిగూడ రైల్వే స్టేషన్ నుంచి అక్కడికి 300 మందితో బయలుదేరిన భక్త బృందానికి భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి భగవంత్‌రావు, వీహెచ్‌పీ నేత మోహన్‌రాజుతో కలిసి వీడ్కోలు పలికారు.

# రైల్వే లైన్ పనులు పరిశీలించిన జిల్లా కలెక్టర్



పార్వతీపురం, (విశాఖ సమాచారమ్): పార్వతీపురం పట్టణ రైల్వే స్టేషన్ దగ్గర జరుగుతున్న మూడవ లైన్ రైల్వే పనులను సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఇ.వి.గురునాథ రావుతో కలిసి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ శుక్ర వారం పరిశీలించారు. త్వరితతిన అందుబాటులోకి తీసుకువచ్చుటకు కృషి చేయాలని సూచించారు. సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ గురునాథ రావు పనుల వివరాలను తెలిపారు. విజయనగరం - టిట్లఘర్ మధ్య నిర్మిస్తున్న రైల్వే మూడవ లైను పనులను 265 కిలో మీటర్లు మేర రూ.2335.68 కోట్లతో చేపట్టడం జరుగుతోందన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 44 కిలో మీటర్లు చేపడుతున్నామని, ఇందులో మేజర్ బ్రిడ్జిలు మూడు, ఆరు ఆర్.యు.బిలు, 135 మైనర్ బ్రిడ్జిలు నిర్మాణం జరుగుతుందని తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లాలో కూనేరు నుండి సీతానగరం వరకు పనులు జరుగుతున్నాయని అన్నారు. పార్వతీపురంలో అదనపు కాలినడక వంతెన, బుకింగ్ కార్యాలయం, కూనేరు, గుమడ, పార్వతీపుం, సీతానగరం లలో మెరుగైన సౌకర్యాలతో కొత్త స్టేషన్ భవనాలు రానున్నాయని చెప్పారు.

# గర్భిణీలకు తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించాలి



పార్వతీపురం, (విశాఖ సమాచారమ్): గర్భిణీల కు శుక్రవారం నిర్వహించిన డీ వార్మింగ్ ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాన్ని విక్రంపురం లో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డి ఐ ఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండవ మరియు మూడవ త్రమాసికంలో ఉన్న గర్భిణీ లకు వైద్య ఆరోగ్య శాఖ సూచనలకు మేరకు జిల్లా వ్యాప్తంగా శుక్రవారం వారి పరిధిలో వైద్య సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలు వేయించడం జరిగిందని, ఈ కార్యక్రమ నోడల్ అధికారిగా పర్యవేక్షణ చేయడం జరిగిందని అన్నారు. ఈ మేరకు ఆయన విక్రంపురంలో గర్భిణీ లకు ఆల్బెండజోల్ మాత్రలను వేయించారు. ఈ కార్యక్రమం ఆవశ్యకతను వివరిస్తూ చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని,పండ్లు , కూరగాయలు శుభ్రంగా కడగాలని,తీసుకునే ఆహారం పరిశుభ్రంగా ఉండాలని తద్వారా వలన నులిపురుగులు చేరకుండా జాగ్రత పడవచ్చని డాక్టర్ జగన్మోహనరావు సూచించారు. నులిపురుగులు వల్ల రక్తహీనత , పోషకాహార లోపం సమస్యలు, కడుపు నొప్పి మొదలగు సమస్యలుంటాయని వీటి నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు వేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్ఎన్ విజయకుమారి, సూపర్ వైజర్ జయగౌడ్ , వైద్య సిబ్బంది ప్రమీల, అనూష ,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# సమగ్ర భూసర్వేను పటిష్టంగా నిర్వహించాలి



కాకినాడ, (విశాఖ సమాచారమ్): ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించే లక్ష్యంతో చేపట్టిన సమగ్ర భూ సర్వే ప్రక్రియను ప్రణాళిక బద్ధంగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అధికారులను ఆదేశించారు. జిల్లాలో రీ సర్వే పనుల పురోగతి, స్టోన్ ప్లాంటేషన్, రైతులకు భూపత్రాల పంపిణీ తదితర అంశాలపై శుక్రవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో జేసీ ఇలక్కియ.. రెవెన్యూ, సర్వే, ఇతర శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ ఇలక్కియ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్ష పథకాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. ఈ నేపథ్యంలో ఎన్నో ఏళ్లుగా సరిహద్దు తగాదాలతో, అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం భూ రికార్డుల స్వచ్ఛీకరణకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. సమగ్ర భూ సర్వేకు సంబంధించి జిల్లాలో తొలి దశలో 121 గ్రామాల్లో సర్వే పనులు చేపట్టడం జరిగిందని జేసీ తెలిపారు. సర్వే పనులు పూర్తయిన గ్రామాల్లో రైతులకు భూహక్కుపత్రాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. స్టోన్ ప్లాంటేషన్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని జేసీ తెలిపారు. అదేవిధంగా రెండో దశలో 87 గ్రామాలకు గ్రామాల్లో రీ సర్వే పనులు ప్రారంభమయ్యాయని రైతులకు ముందుగానే సర్వే ప్రక్రియపై అవగాహన కల్పించి, సరిహద్దు రైతులకు ఎటువంటి వివాదాలకు తావులేని విధంగా సర్వే ప్రక్రియ నిర్వహించాలన్నారు. ఇందుకు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న రెవెన్యూ, సర్వే శాఖల సిబ్బంది సమన్వయంతో పూర్తిప్రణాళికతో పనిచేయాలన్నారు. ముఖ్యంగా అటవీ సరిహద్దు భూములు ఉన్న గ్రామాల్లో అటవీ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని రెవెన్యూ, సర్వే అధికారులు పనిచేయాలని జేసీ ఇలక్కియ ఆదేశించారు. కాకినాడ, పెద్దాపురం రెవెన్యూ డివిజన్ల వారీగా ఆయా మండలాల వారీగా రీ సర్వే పనుల పురోగతి, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న వివిధ సమస్యలను జేసీ.. తహసీల్దారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల రెవెన్యూ, సర్వే అధికారులకు సమగ్ర భూ సర్వే, స్టోన్ ప్లాంటేషన్, భూ హక్కు పత్రాల పంపిణీ తదితర అంశాలపై మెలకువలను పీపీటీ ద్వారా జేసీ అవగాహన కల్పించారు. సమావేశంలో కాకినాడ, పెద్దాపురం రెవెన్యూ డివిజన్ అధికారులు బీవీ రమణ, జె.సీతారామారావు, ఏడీ సర్వే బి.లక్ష్మీనారాయణ, వివిధ మండలాల తహసీల్దార్లు, డీటీలు ఇతర అధికారులు తదితరులు హాజరయ్యారు.

# ఫైన్ కట్టమన్నందుకు.. రవాణాశాఖ అధికారిపై కొబ్బరి బొండాల కత్తితో దాడి



కాకినాడ, (విశాఖ సమాచారమ్): కాకినాడలో దారుణం చోటుచేసుకుంది. జరిమానా కట్టమన్నందుకు రవాణాశాఖ అధికారిపై కొబ్బరి బొండాలు అమ్ముకునే వ్యక్తి కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో అధికారికి తీవ్ర గాయాలయ్యాయి. అందరూ చూస్తుండగానే ఈ ఘటన చోటుచేసుకుంది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం కాకినాడలోని దేవాదాయ శాఖ కార్యాలయం సమీపంలో వ్యాన్‌పై పెంటా వెంకట దుర్గాప్రసాద్ అనే వ్యక్తి కొబ్బరి బొండాలు అమ్ముతున్నారు. తనిఖీల్లో భాగంగా అతడి వద్దకు అసిస్టెంట్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం.చిన్నారావు వెళ్లారు. వ్యాన్ రికార్డులు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్ వివరాలను ఆయన అడిగారు. వాహనానికి ఇది వరకే పడిన జరిమానా కట్టాలని సూచించారు. ఈ క్రమంలో వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో కోపోద్రిక్తుడైన దుర్గాప్రసాద్.. తన వద్ద ఉన్న కత్తితో చిన్నారావును విచక్షణా రహితంగా గాయపరిచాడు. అడ్డుకునే ప్రయత్నం చేసిన వారిపైనా దాడికి యత్నించడంతో వారు భయపడిపోయారు. ఈ ఘటనలో రవాణా శాఖ అధికారి చేతి బొటనవేలు తెగింది. వెంటనే ఆయన్ను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం చిన్నారావు పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. రవాణాశాఖ అధికారిపై దాడి చేసిన దుర్గారావును పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

# ఘనంగా ఎల్లమ్మ తల్లి పండుగ

### పసుపు కుంకుమలు సమర్పించిన భక్తులు



సింహాచలం, (విశాఖ సమాచారమ్): అడవివరం సిడగంపేట ప్రాంతంలో కొలువై ఉన్న శ్రీ ఎల్లమ్మతల్లి పండుగ మహోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రతి యేట సాంప్రదాయ బద్దంగా నిర్వహించే ఈ ఉత్సవాన్ని ఈ యేడాది కూడా అత్యంత వైభవంగా జరిపించారు.

అమ్మవారిని సుప్రభాత సేవతో మేలుకొలిపి ఆరాధన గావించారు. అనంతరం భక్తులందరికీ అమ్మవారి దర్శన భాగ్యం కల్పించారు. సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు, విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయం సలహా మండలి సభ్యులు , జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి, వైజాగ్ జర్నలిస్టుల ఫోరం అధ్యక్షుడు గంట్ల శ్రీను బాబు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా శ్రీను బాబు మాట్లాడుతూ గ్రామదేవతల పండగలు ఎంతో విశిష్టమైనవని ఆయా అమ్మవార్ల ఆశీస్సుల వల్లే ప్రజలంతా సుభిక్షంగా ఉంటున్నారన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీగా అన్న సంతర్పన, ప్రసాద వితరణ గావించారు.

# కెమిశీల పాఠశాలను తనిఖీ చేసిన పి.ఓ.



పార్వతీపురం, (విశాఖ సమాచారమ్): కొమరాడ మండలం కెమిశీల ఆశ్రమ పాఠశాలను ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి. విష్ణు చరణ్ శుక్ర వారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆశ్రమ పాఠశాలలో విద్యా ప్రమాణాలు, ఆహార పదార్థాల తయారీ తదితర వివరాలను పరిశీలించారు. విద్యార్థుల భవిష్యత్తుపై దృష్టి సారించాలని ఆయన ఆదేశించారు. చక్కని భవితకు పునాదులు వేయాలని ఆయన స్పష్టం చేశారు. ప్రతి తరగతిలో ప్రమాణాలు మెరుగుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆయన సూచించారు. ఉన్నత విద్య అవకాశాలు తెలియజేయాలని, అందుకు అనుగుణంగా బోధన అందించాలని పి.ఓ అన్నారు. పోటీ ప్రపంచంలో మన విద్యార్థులు వెనుకంజలో ఉండరాదని ఆయన స్పష్టం చేశారు. మంచి ఆహారాన్ని అందించాలని తద్వారా విద్యపై దృష్టి సారించగలరని ఆయన చెప్పారు. ఆహార పదార్థాల తయారీ సమయంలో పూర్తి అప్రమత్తంగా ఉండాలని ఆయన అన్నారు. చిన్నపాటి నిర్లక్ష్యం తీవ్ర పరిస్థితులకు దారి తీస్తుందని గ్రహించాలని ఆయన పేర్కొన్నారు. రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# 31న పింఛన్ అదాలత్

కాకినాడ, (విశాఖ సమాచారమ్): కాకినాడ పోస్టల్ డివిజన్ పరిధిలోని పింఛనుదారుల ఫిర్యాదులు, సమస్యల పరిష్కారానికి ఈ నెల 31వ తేదీ, సాయంకాలం 5 గంటలకు స్థానిక పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో పింఛను అదాలత్ నిర్వహించనున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ డీఎస్వ్యూ నాగేశ్వరరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫిర్యాదుదారులు ఈ నెల 20వ తేదీలోపు పింఛన సేవలకు సంబంధించిన ఫిర్యాదులు, సలహాలను పింఛను అదాలత్ శీర్షికతో సూపరింటెండెంట్ కార్యాలయం, కాకినాడ-533001 చిరునామాకు పంపాల్సిందిగా సూచించారు. ఫిర్యాదుదారులు వ్యక్తిగతంగా కూడా అదాలత్కు హాజరుకావొచ్చన్నారు.

# రైలు దిగుతూ జారిపడి మహిళ మృతి



కాప్రా, రెజిమెంటల్‌బజార్: రైలు దిగుతూ జారిపడి భార్య మృతి చెందగా రక్షించబోయిన భర్తకు తీవ్రగాయాలైన ఘటన చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో జరిగింది. సికింద్రాబాద్ జీఆర్‌పీ పోలీసుల కథనం.. వరంగల్ జిల్లా శాయంపేటకు చెందిన రాచర్ల ప్రభాకర్ ఆర్ఎంపీ వైద్యుడు. భార్య సంధ్యారాణి (40) ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చర్లపల్లిలో ఉన్న ప్రభాకర్ చెల్లెలు ఇంట్లో శుభకార్యానికి హాజరయ్యేందుకు భార్య, మరో 10మంది బంధువులతో గురువారం కాజీపేట స్టేషన్‌లో పుష్‌పుల్ రైలు ఎక్కారు. సాయంత్రం 5.30 గంటలకు చర్లపల్లి స్టేషన్‌కు వచ్చింది. బంధువులు అందరూ దిగారు. సంధ్యారాణి దిగే సమయానికి రైలు కదిలింది. ప్లాట్‌ఫామ్‌కు రైలుకు మధ్య పడి మృతి చెందింది. ఆమెను రక్షించేందుకు యత్నించిన ప్రభాకర్ కుడికాలు పాదం నుజ్జయింది. పోలీసులు ఆయన్ని ఈసీఐఎల్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

## అర్హులైన పౌరులకు ఓటు అనేది హక్కు అని తేల్చి చెప్పిన ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ: పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో ఓటింగ్ తప్పనిసరి చేయాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాన్ని ఢిల్లీ హైకోర్టు శుక్రవారంనాడు తోసిపుచ్చింది. ఓటు వేయడం అనేది ఐచ్ఛికమని, న్యాయవ్యవస్థ అలాంటి ఆదేశాలు జారీ చేయలేదని కోర్టు స్పష్టం చేసింది. భారతదేశంలోని అర్హులైన పౌరులకు ఓటు అనేది వారి హక్కు అని, అది ఐచ్ఛికమని కోర్టు చెప్పడంతో పిటిషనర్ తన పిల్ ఉపసంహరించుకున్నారు.

ప్రాక్టీసింగ్ అడ్వకేట్, బీజేపీ నేత అశ్విన్ కుమార్ ఉపాధ్యాయ ఈ పిల్ వేశారు. ఓటింగ్ తప్పనిసరి చేస్తూ నివేదకను సిద్ధం చేయాల్సిందిగా లా కమిషన్‌ను ఆదేశించాలని కూడా కోర్టును పిటిషనర్ కోరారు. పోలింగ్ శాతం అనేది ఇండియాను వేధిస్తున్న సమస్య అని అన్నారు. ఓటింగ్‌ను తప్పనిసరి చేయడం వల్ల ఓటింగ్ శాతం పెరుగుతుందని, ముఖ్యంగా అట్టడుగు వర్గాల్న ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఇది మరింత ఉపయుక్తంగా ఉంటుందని అన్నారు. ప్రతి పౌరుడు తన గళం వినిపించాలని, ప్రజాభీష్టానికి ప్రతినిధగా ప్రభుత్వం ఉండాలని ఆయన తన పిటిషన్‌లో పేర్కొనారు.

తప్పనిసరి ఓటింగ్‌ను ఆస్ట్రేలియా, బెల్జియం, బ్రెజిల్ వంటి దేశాలు విజయవంతంగా అమలు చేశాయని పిటిషనర్ చెప్పారు. ఈ దేశాల్లో గణనీయంగా ఓటింగ్ శాతం పెరిగిందని, ప్రజాస్వామ్య నాణ్యతా ప్రమాణాలు మెరుగయ్యాయని అన్నారు. 326వ అధికరణ కింద ఓటును ప్రాథమిక హక్కుగా రాజ్యాంగం గుర్తించిందని, ప్రజాస్వామ్యం పనితీరు సక్రమంగా కొనసాగేలా సహేతుక ఆంక్షలు విధించడం ద్వారా తప్పనిసరి ఓటింగ్‌ను అమలుచేయవచ్చని పిటిషనర్ పేర్కొన్నారు.

# కొబ్బరిబోండంలోని లేతకొబ్బరిని తింటే గుండెకి మంచిది



కొబ్బరిబోండాల సీజన్ వచ్చేసింది. ప్రతి ఒక్కరు కూడా నేడు పెరిగిన ఎండల నుంచి ఉపశమనం కోసం కొబ్బరిబోండాలు తాగుతున్నారు. దీని వల్ల ఎండ వేడి నుంచి ఉపశమనం పొందొచ్చు. అయితే, కొంతమంది కొబ్బరిబోండాం తాగక అలానే బోండాన్ని పడేస్తారు. అలా కాకుండా కొంతమంది కొబ్బరిని తింటారు. నిజానికి, ఈ కొబ్బరి తినడం చాలా మంచిది. దీనిని అస్సలు మిస్ చేయకుండా తినాలని చెబుతున్నారు

**కొబ్బరితో లాభాలు..** కొబ్బరిబోండాంలోని కొబ్బరిలో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను పెంచుతుంది ఇమ్యూనిటీని పెంచుతుంది. కొబ్బరిలో లారిక్ యాసిడ్, యాంటీ ఆక్సిడెంట్స్ ఎక్కువగా ఉంటాయి. ఇవి స్కిన్‌కి చాలా మంచిది. ఇందులో కొవ్వు శాతం తక్కువగా ఉంటుంది. అందుకే, దీనిని తినడం వల్ల కొలెస్ట్రాల్ పెరుగుతుందన్న భయం ఉండదు. గుండె ఆరోగ్యం మెరుగ్గా ఉంటుంది.

**కొబ్బరితో వంటలు..** తాజా కొబ్బరిని తినడం మంచిది. వీటిని మనం రెగ్యులర్‌గా అలానే తింటే బోర్ కొడుతుంది. అలా కాకుండా వీటితో కొన్ని వంటలు చేసుకోవచ్చు. దీని వల్ల టేస్టీ ఫుడ్ ఐటెమ్స్‌ని మనం ఎంజాయ్ చేసినట్లు ఉంటుంది. మరి ఆ వంటలు ఏంటి.. ఎలా చేయాలో చూద్దాం.

**ఖీర్..** కొబ్బరితో ఖీర్.. అది కూడా లేత కొబ్బరి చాలా టేస్టీగా ఉంటుంది.ఇందుకోసం ముందుగా కావాల్సిన పదార్థాలు ఏంటో చూద్దాం.

**కావాల్సిన పదార్థాలు..**

1 కప్పు కొబ్బరి, 1 కప్పు కొబ్బరి నీరు, 1 టేబుల్ స్పూన్ తేనె, ఓ ఐదారు చుక్కల వెనీలా ఎసెన్స్,

**తయారీ విధానం..** ముందుగా లేత కొబ్బరిని బయటికి తీసి బ్లెండర్‌లో వేసి కొబ్బరి నీరు, తేనె, వెనీలా ఎసెన్స్ వేయండి. దీనిని స్మూతీలా అయ్యేవరకూ మిక్సీ పట్టండి. ఇందులో కొద్దిగా నట్స్ కూడా మీరు యాడ్ చేసుకోవచ్చు.

**కొబ్బరి లడ్డూ..** కొబ్బరి లడ్డూ చాలా టేస్టీగా ఉండే ఈ లడ్డూలను ఈజీగా చేసుకోవచ్చు. ఇందుకోసం కావాల్సిన పదార్థాలను చూద్దాం.

**కావాల్సిన పదార్థాలు..** 1 కప్పు లేత కొబ్బరి, 1 కప్పు పాలపొడి, ముప్పావు కప్పు పంచదార, పావు కప్పు నెయ్యి, పావు టీస్పూన్ యాలకుల పొడి, 2 టేబుల్ స్పూన్ల జీడిపప్పు తరుగు.

**తయారీ విదానం..** పాన్‌లో నెయ్యి వేసి మీడియం మంటపై వేడి చేయండి. ఇందులో సన్నగా తరిగిన లేత కొబ్బరి వేసి ఫ్రై చేయండి. ఇందులో యాలకుల పొడి, పాలపొడి వేయాలి.

మరో పాన్‌లో చక్కెర, అరకప్పు నీరు పోయండి. దీనిని పాకంలా చేయండి. ఇప్పుడు అందులో కొబ్బరి, పాలపొడి మిశ్రమాన్ని పాకంలో వేయండి. దీనిని బాగా కలపండి. సిమ్‌లో పెట్టి మిశ్రమం మొత్తం పాన్ నుంచి విడిపోయే వరకూ ఫ్రై చేయండి. ఇప్పుడు ఇందులో జీడిపప్పు వేసి మంట ఆర్పేయండి. చేతులకి నెయ్యి రాసి మిశ్రమం గోరువెచ్చగా అయ్యాక మిశ్రమాన్ని లడ్డూల్లా చేసుకోవాలి.

**కొబ్బరి ఐస్‌క్రీమ్..**

**కావాల్సిన పదార్థాలు..** కప్పు కొబ్బరి మలై, 1 కప్పు కొబ్బరి నీరు, 1 కప్పు హెవీ క్రీమ్, అరకప్పు చక్కెర, 1 టీ స్పూన్ వెనీలా ఎసెన్స్.

**తయారీ విధానం..** ముందుగా కొబ్బరిని నీటితో కలిపి మిక్సీ వేసి బ్లెండ్ చేయండి. ఇప్పుడు అందులో హెవీ క్రీమ్, షుగర్, వెనీలా ఎసెన్స్ వేసి బాగా మిక్సీ పట్టండి. ఇప్పుడు తయారైన స్మూతీని స్టిక్ బ్లెండర్‌తో మరోసారి బ్లెండ్ చేసి ఓ టిన్‌లో వేసి ఫ్రిజ్‌లో 4 నుంచి 5 గంటల పాటు ఫ్రీజ్ చేయండి. తయారైన ఐస్‌క్రీమ్‌ని నట్స్, ఫ్రూట్స్‌తో గార్నిష్ చేయండి.

# మీ నడక స్టైల్ మారిందా..?



లివర్ మన శరీరంలో ముఖ్యమైన అవయవం. లివర్ మన శరీరంలో నుంచి విషపదార్థాలను తొలగిస్తుంది. కొవ్వులు, ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్‌లను జీవక్రియ చేయడానికి కీలక పాత్ర పోషిస్తుంది. గ్లైకోజెన్, విటమిన్లు, మినరల్స్‌ను నిల్వ చేస్తుంది. లివర్ అల్బుమిన్, ప్లాస్మా ప్రొటీన్‌లను సంశ్లేషణ చేస్తుంది. రోగనిరోధక శక్తి, జీవక్రియ, పోషకాల సరఫరా, నిల్వ చేయటంలో కాలేయం చాలా అవసరం. లివర్ మన శరీరంలో దాదాపు 500 రకాల పనులను చేస్తుంది. మనం లివర్‌ను జాగ్రత్తగా చూసుకోవడం చాలా ముఖ్యం.

అయితే, ప్రస్తుతం ఫ్యాటీ లివర్ సమస్యతో ఎంతో మంది బాధపడుతున్నారు. మనదేశంలో 9% నుంచి 32% మంది ఫ్యాటీ లివర్‌తో ఇబ్బంది పడుతున్నారు. లివర్‌లో అదనపు కొవ్వు పేరుకుపోవడాన్ని.. హెపాటిక్ స్టీటోసిస్ అని కూడా అంటారు. ఫ్యాటీ లివర్ సమస్య రెండు రకాలు ఉంటుంది. 1. ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్, 2. నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్. ఆల్కహాల్ ఎక్కువగా తాగేవారికి ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ సమస్య వచ్చే అవకాశం ఉంది. ఆల్కహాల్ తక్కువగా, అసలు తాగని వారిలో ఫ్యాటీ లివర్ సమస్య వస్తే.. దాన్ని నాన్-ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్ అంటారు. కొన్నిరకాల జబ్బులు, జన్యువులు, ఆహారం, జీర్ణకోశ వ్యవస్థ లోపం, అధిక బరువు, డయాబెటిస్ సమస్యతో బాధపడేవారికి.. నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ సమస్య వచ్చే ముప్పు ఎక్కువగా ఉంటుంది. రెండు రకాల ఫ్యాటీ లివర్ సమస్యలు ప్రాణాంతకమని అంటున్నారు.

**ఈ లక్షణాలు ఉంటాయి..** ఫ్యాటీ లివర్ కారణంగా.. పొత్తికడుపు నొప్పి, కడుపు నిండుగా ఉండటం, వికారం, ఆకలి లేకపోవటం, బరువు తగ్గడం, చర్మం పసుపు రంగులోకి మారడం, కళ్ల తెల్లగా మారడం, పొత్తికడుపు, కాళ్ల ఉబ్బటం, అలసట, మానసిక గందరగోళం, బలహీనత వంటి లక్షణాలు కనిపిస్తాయి.

**నడక మారుతుంది..** రెండు రకాల ఫ్యాటీ లివర్ డిసీజ్‌లలో, నాన్-ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్ న్యూరోలాజికల్ వ్యాధులకు.. వాస్కులర్ రిస్క్ ఫ్యాక్టర్‌లలో ఒకటి అని, తెలిపింది. లివర్ సమస్యల కారణంగా.. శరీరంలోని అనేక విధులను ఎఫెక్ట్ అవుతాయి. ఫ్యాటీ లివర్ సమస్య కారణంగా మానసిక స్థితి, మాట్లాడే విధానం, నిద్ర, వ్యక్తి కదలకలలోనూ మార్పులకు దారితీస్తుంది. వాకింగ్ స్టైల్‌లో మార్పులు కనిపిస్తే.. ఫ్యాటీ లివర్ వ్యాధిని సూచిస్తాయని పేర్కొంది.

**ఈ మార్పులు ఉంటాయి..** లివర్ ట్రస్ట్ ప్రకారం, ఫ్యాటీ లివర్ కారణంగా వ్యక్తి నడకలో అత్యంత సాధారణంగా రెండు మార్పులు కనిపిస్తాయి. నడక అస్థిరంగా ఉంటుంది, తూలుతూ ఉంటారు. నడకలో సమన్వయం ఉండదు. లాస్ట్ స్టేజ్ ఫ్యాటీ లివర్ సమస్యలు, పార్కిన్సన్స్ మధ్య సారూప్యతను అధ్యయనాలు స్పష్టం చేశాయి. న్యూరోలాజికల్ ఎగ్జామినేషన్ రిపోర్ట్ ప్రకారం, "పార్కిన్సన్స్ వ్యాధిలా కాకుండా.. ఫ్యాటీ లివర్‌లో నడగ, భంగిమలో సమస్యలు ఎక్కువగా ఉంటాయి.

**ఈ జాగ్రత్తలు తీసుకోండి..** ఫ్యాటీ లివర్ ముప్పును తగ్గించుకోవడానికి జీవనశైలిలో మార్పులు చేసుకోవడం చాలా అవసరం అని నిపుణులు చెబుతున్నారు. ఫ్యాటీ లివర్ సమస్యకు దూరంగా ఉండటానికి మంచి పోషకాహారం తీసుకోవాలి. కొవ్వులు, నూనె పదార్థాలు తగ్గించాలి. సంతృప్త కొవ్వులకు బదులు అసంతృప్త కొవ్వులతో కూడిన చేపలు, అవిసె గింజలు, అక్రోట్ల వంటివి తీసుకోవాలి.

కూరగాయలు, పండ్లను శుభ్రంగా కడిగిన తర్వాతే తినాలి. దీంతో ఫెర్టిలైజర్స్ ప్రభావాలను తగ్గించుకోవచ్చు.

చక్కెర ఎక్కువగా ఉండే కూల్‌డ్రింకులు, స్పోర్ట్స్ డ్రింక్స్, వంటి వాటికి దూరంగా ఉండాలి.

స్మోకింగ్, ఆల్కహాల్ మానేయాలి.

రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి.

# వేసవిలో గ్రీన్ టీ, అల్లం టీ తో పాటు..ఈ 'టీ'లు కూడా తాగితే బరువు తగ్గుతారు



వేసవి దాదాపు వచ్చేసింది. కాబట్టి, ప్రజలు సాధారణంగా తినే వాటికి బదులుగా ప్రత్యామ్నాయ ఆహారాల కోసం చూస్తున్నారు. వేసవిలో ఎలాంటి టీ తాగాలి అనేది చాలా మంది ప్రశ్న. వేసవి తాపాన్ని నివారించి శరీరం చల్లగా ఉండాలంటే మజ్జిగ, జ్యూస్, లస్సీ వంటి పానీయాలు తాగాలని మనసు కోరుకోవడం సహజం. వేసవిలో టీ తాగడం సహించదు. టీకి బదులు పుచ్చకాయ, మందార, అల్లం, పుదీనా టీ తాగడం వల్ల శరీర ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

టీ తాగడం చాలా మందికి ఒక వ్యసనం. కొందరు టీ లేకుండా రోజు గడపలేడు. కానీ వేసవిలో టీ ఆరోగ్యానికి మంచిది కాదు అదనంగా, వేసవిలో శరీరం మరియు మనస్సు రెండూ టీకి బదులుగా ఇతర పానీయాలను తాగాలని కోరుకుంటాయి. కొన్ని పువ్వులు, ఆకులు మరియు పండ్ల నుండి టీని తయారు చేసి త్రాగడం ద్వారా, శరీరం మరియు మనస్సు ఉల్లాసాన్ని మరియు శక్తిని పొందుతాయి. ఇలా హెర్బల్ లేదా పండ్లు, లేదా ఆకులతో తయారుచేసే టీలలో శీతలీకరణ గుణాలుండట వల్ల ఈ పదార్థాలను ఉపయోగించడం గొప్ప ఆలోచన. వీటిలో ఉండే క్యాటెచిన్స్ అనే ఫ్లేవనాయిడ్స్ వల్ల టీలో చాలా ప్రయోజనాలు ఉన్నాయి. ఇది జీవక్రియను పెంచుతుంది. శరీర కొవ్వును ఎఫెక్టివ్‌గా విచ్ఛిన్నం చేయడంలో సహాయపడుతుంది. టీలో అనేక యాంటీఆక్సిడెంట్లు మరియు సహజ మూలికలు ఉన్నాయి.

అంతే కాదు ఈ టీలు తాగడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచడంతో పాటు బరువు నియంత్రణ మరియు కొవ్వు కరిగించడంలో సహాయపడే హెర్బల్ టీలను కూడా తయారు చేసుకోవచ్చు. వేసవిలో క్రమం తప్పకుండా వ్యాయామం చేయడంతోపాటు వీటిలో కొన్ని పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు మరియు మూలికలతో చేసిన టీ తాగడం వల్ల శరీర బరువు అదుపులో ఉంటుంది.

గ్రీన్ టీ గ్రీన్ టీలో ఆరోగ్యకరమైన బయోయాక్టివ్ కాంపౌండ్స్ ఉంటాయి. ఇది మన మెదడు పనితీరును మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ఇది శరీరంలోని కొవ్వును కరిగిస్తుంది. శరీరానికి యాంటీఆక్సిడెంట్లను అందించడం ద్వారా కొన్ని క్యాన్సర్ లక్షణాలను నియంత్రిస్తుంది. ఇది మెదడు వృద్ధాప్యాన్ని నివారిస్తుంది. నోటి దుర్వాసనను తొలగిస్తుంది. ఇది టైప్ 2 దయాబెటిస్‌కు కూడా నివారణ. కార్డియో వాస్కులర్ సమస్యల నుండి బయటపడటం కూడా సాధ్యమే.

అల్లం టీ: ఇది ఉదయం నీరసాన్ని తొలగిస్తుంది. దీర్ఘకాలిక అజీర్ణ సమస్య నుండి ఉపశమనం పొందుతుంది. ఆస్టియో అర్థరైటిస్ వల్ల వచ్చే కీళ్ల నొప్పుల నుండి ఉపశమనం పొందడంలో సహాయపడుతుంది.

పిప్పరమింట్ టీ: మిథనాల్ కలిగి ఉంటుంది. కడుపు నొప్పిని తగ్గిస్తుంది, మలబద్ధకం నుండి ఉపశమనం పొందడంలో సహాయపడుతుంది. ఇది టెన్షన్ తలనొప్పిని తగ్గించడమే కాకుండా మైగ్రేన్‌లను కూడా తగ్గిస్తుంది.

మందారం టీ: మందార టీ తాగడం వల్ల అధిక రక్తపోటు తగ్గుతుంది. ఇది కాలేయ ఆరోగ్యానికి కూడా మంచిది. కిడ్నీలో రాళ్ల ఉన్నవారు దీన్ని తాగడం మంచిది.

పుచ్చకాయ టీ పుచ్చకాయ గుజ్జు టీ తాగడం వల్ల బరువు తగ్గుతారు. ఇది శరీరంలో వాటర్ కంటెంట్‌ను నియంత్రిస్తుంది. ఇందులో క్యాలరీలు తక్కువగానూ, ఫైబర్ అధికంగానూ ఉంటుంది. అందుకే బరువు నియంత్రణకు ఇది చాలా మంచిది. చాలా మంది పుచ్చకాయ గుజ్జును పారేస్తారు. కానీ ఇందులో ఉండే పోషకాల పరిమాణం చాలా ఎక్కువ. పుచ్చకాయ గుజ్జును తొక్కతో పాటు చిన్న ముక్కలుగా కట్ చేసి, నీటి రంగు లేత గులాబీ రంగులోకి వచ్చే వరకు ఉడికించాలి. దీనికి పుదీనా ఆకులను జోడించవచ్చు. దీన్ని ఫ్రిజ్‌లో ఉంచి తాగవచ్చు లేదా ఐస్ క్యూబ్స్‌తో తాగవచ్చు. ఇది శరీరాన్ని ఉత్తేజపరచడమే కాకుండా అనేక ఆరోగ్య ప్రయోజనాలను కూడా కలిగి ఉంటుంది.

చమోమిలే టీ: చామంతి టీ తాగడం వల్ల రుతుక్రమంలో వచ్చే నొప్పుల నుంచి ఉపశమనం పొందవచ్చు. ఇది కండరాల నొప్పులను తగ్గిస్తుంది. నిద్ర నాణ్యతను మెరుగుపరుస్తుంది. ఇది ఒత్తిడిని దూరం చేసి మనసుకు విశ్రాంతినిస్తుంది.

# చుక్కకూరకి క్యాన్సర్‌కి సంబంధం ఏంటి



ఆకుకూరలు చాలా పోషకాలు నిండి ఉంటాయని డాక్టర్లు అందరూ చెబుతూ ఉంటారు. ఐరన్, కాల్సియం, విటమిన్ ఏ, సూక్ష్మ పోషకాలు, యాంటి ఆక్సిడెంట్స్, మినలర్స్ వంటివి.. కూరగాయల్లో కంటే ఆకుకూరల్లోనే ఎక్కువ ఉంటాయి. కూరగాయలు కంటే ఆకుకూరలే ఎక్కువ శక్తిని ఇస్తాయి. అంతేకాదు కూరగాయల్లో నూనె, ఉప్పు, మసాలాలు ఎక్కువ పడతాయి. కానీ ఆకుకూరల్లో అంతగా అవసరం పడవు. ఇవి పక్కనబెడితే కూరగాయల కంటే ఆకుకూరలు చాలా చవక కూడా.

100 గ్రాముల చుక్కకూరలో.. నీటి శాతం 90 గ్రాములు, ఎనర్జీ 19 కిలో క్యాలరీలు, పిండి పదార్థాలు 2.3గ్రాములు, మాంసకృత్తులు 1.6 గ్రాములు, కొవ్వులు 1.2 గ్రాములు, పీచు పదార్థాలు 1.2గ్రాములు ఉంటాయి. ఇవన్నీ స్థూల పోషకాలు. ఇక సూక్ష్మ పోషకాల విషయానికి వస్తే.. విటమిన్ సి 53 మిల్లి గ్రాములు, విటమిన్ కె 126 మైక్రో గ్రాములు, లూటిన్ 2370 మైక్రో గ్రాములు, బీటాకెరొటిన్ 2754 మైక్రో గ్రాములు, ఐరన్ 4 మిల్లి గ్రాములు, మెగ్నిషియం 48 మిల్లి గ్రాములు ఉంటాయి.

**చుక్కకూర ప్రయోజనాలు:**

గుండెకు రక్త సరఫరా చేసే నాళాల్లో పూడికలు లేకుండా చూస్తుంది చుక్కకూర. రక్తనాళాల లోపల ఉండే పొరల్లో నైట్రిక్ ఆక్సైడ్ ప్రొడక్షన్ పెరిగిలా చేస్తుంది. దీంతో రక్తనాళాలు వ్యాకోచం చెందుతాయి. అప్పుడు బీపీ కంట్రోల్ అవుతుంది. ఆడవారికి వచ్చే రొమ్ము క్యాన్సర్, సర్విక్ క్యాన్సర్ రాకుండా చుక్కకూర నివారిస్తుంది. అయితే చుక్కకూరను వండే తినాలి. పచ్చిగా దేనిలో మిక్స్ చేయకూడదు. బాలింతలకు పాలు బాగా పెరగాలంటే.. చుక్కకూర తినాల్సిందే.

# గర్భిణీలు పచ్చిబొప్పాయి తింటే డేంజరా..?



ప్రెగ్నెన్సీ సమయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి ఎందుకంటే తల్లి, బిడ్డ ఇద్దరి భద్రత ముఖ్యం. చిన్న పొరపాటు తల్లి, బిడ్డ ఇద్దరిపై చెడు ప్రభావం చూపుతుంది. అందుకే ఈ సమయంలో ఆహారం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. ప్రెగ్నెన్సీ సమయంలో బొప్పాయి తినకూడదని మీరు తరచుగా వినే ఉంటారు.ఇంట్లో పెద్దలు కూడ చెప్పడం వినే ఉంటాం. డాక్టర్లు కూడా అదే చెబుతారు. గర్భిణీలు బొప్పాయి తింటే గర్భస్రావం అవుతుందని కూడా కొందరు అంటున్నారు.

**బొప్పాయి తింటే నిజంగా గర్భస్రావం అవుతుందా?**

పచ్చి లేదా తక్కువ పండిన బొప్పాయిలో లాటెక్స్ , పాపైన్ అనే రసాయనాలు ఉంటాయి, ఇవి కడుపులో పెరుగుతున్న పిండానికి హానికరం. బొప్పాయిలో ఉండే రబ్బరు పాలు గర్భాశయాన్ని తగ్గిస్తుంది, ఇది పిండానికి ప్రమాదకరం. పండిన బొప్పాయి తినడం ప్రెగ్నెన్సీ లో ప్రయోజనకరమైనది. అయినప్పటికీ చాలా మంది పండిన , పండని బొప్పాయి మధ్య తేడా తెలియక తికమకపడుతుంటారు. దీంతో మొత్తానికే బొప్పాయి తినేందుకు దూరం అవుతారు.

**బొప్పాయి బాగా పండినప్పుడు తినండి:** మరోవైపు, బొప్పాయిని ప్రెగ్నెన్సీ సమయంలో తినవచ్చు, కానీ అది పూర్తిగా పండినప్పుడే తినాలి. తక్కువ పరిమాణంలో తినాలని కొందరు నిపుణులు అంటున్నారు. పూర్తిగా పండిన బొప్పాయిలో విటమిన్ సి , విటమిన్ ఇ , ఫైబర్ , ఫోలిక్ యాసిడ్ సమృద్ధిగా ఉంటుంది.

ప్రెగ్నెన్సీ సమయంలో పచ్చి బొప్పాయి తినడం గర్భస్రావం లేదా అకాల డెలివరీ ప్రమాదాన్ని పెంచుతుందని తేలింది. అదే సమయంలో పండిన బొప్పాయి తినడం మంచిది అని పేర్కొంది. పండిన బొప్పాయిని తిన్న గర్భిణీ ఎలుకలలో గర్భస్రావం అయ్యే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయని 2002లో ప్రచురించబడిన ఒక అధ్యయన ఫలితాలు చెబుతున్నాయి, అయితే పచ్చి బొప్పాయిని తిన్న తర్వాత గర్భస్రావం , నెలలు నిండకుండానే ప్రసవం అయ్యే ప్రమాదం చాలా ఎక్కువగా ఉందని నిపుణులు తేల్చారు.

పచ్చి బొప్పాయిలో రబ్బరు పాలు ఎక్కువగా ఉంటాయని, వాటిలో ఉండే ఎంజైమ్‌ల వల్ల ఇలా జరిగిందని, ఇప్పటి వరకు మనుషులపై అలాంటి అధ్యయనాలు, పరిశోధనలు జరగనప్పటికీ బొప్పాయి వినియోగం పూర్తిగా ప్రయోజనకరమని చెప్పలేమని వైద్యులు చెబుతున్నారు.

# మీల్ మేకర్ వల్ల ఉపయోగాలు



సోయా చంక్స్‌ను మీల్ మేకర్స్ అని కూడా అంటారు. సోయా పిండితో వీటిని తయారు చేస్తారు అందువల్లనే వీటిని సోయా చంక్స్ అంటారు. మీల్ మేకర్స్‌ను తయారు చేసే క్రమంలో సోయా గింజల నుంచి తొలుత ఆయిల్‌ను వేరుచేస్తారు. తర్వాత మిగిలిపోయిన పిండిని మీల్ మేకర్స్ తయారీకి వినియోగిస్తారు. దీనిలో కూడా పోషకాలు అధికంగానే ఉంటాయి. దీనిలో కొవ్వు ఉండదు. దీన్ని వెజిటేరియన్ మీట్ అని పిలుస్తారు. కొన్ని చోట్ల సోయా మీట్ అని కూడా పిలుస్తారు. వీటిని వెజ్ బిర్యానీలో వేస్తే మటన్ రుచికి సరిపోలుతుంది. వీటితో చేసిన వంటకాలు తినడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మంచిదని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. అందువల్లనే మటన్‌కు ప్రత్యామ్నాయంగా మీల్ మేకర్స్‌ను వంటకాల్లో వినియోగిస్తుంటారు. వీటిని తినడం వల్ల శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రించి మంచి కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచేందుకు దోహదపడతాయి. సోయాబీన్స్‌లో అమెనో యాసిడ్స్ పుష్కలంగా ఉండటం రక్తపోటును కూడా సులభంగా నియంత్రిస్తాయి. గుండెజబ్బులు, క్యాన్సర్లు వంటి వ్యాధులు వచ్చే ప్రమాదాన్ని చాలా వరకు తగ్గించే లక్షణం కలిగి ఉంటాయి. వీటిలో ప్రోటీన్లు అధికంగా ఉండటం వల్ల మాంసాహారం తినని వారికి ఇది ఉత్తమ ఎంపిక. దీనిలో ఫైబర్ కంటెంట్ అధికంగా ఎక్కువగా ఉంటుంది. మధుమేహం ఉన్న వారు కూడా వీటిని తినవచ్చు. వీటిని తింటే చర్మం, జుట్టు ఆరోగ్యంగా ఉంచేందుకు దోహదపడుతుంది.

# అమ్మాయిలు పెళ్లి కాక ముందే జుట్టు రాలిపోతుందని టెన్షన్ పడుతున్నారా



శరీరంలో పోషకాల లోపం ఉంటే, అది నేరుగా మన జుట్టుపై ప్రభావం చూపుతుంది. జుట్టు రాలడాన్ని ఆపడానికి అత్యంత ప్రభావవంతమైన మార్గం ఏమిటంటే, జుట్టుకు చాలా ముఖ్యమైన ఆహారాలను మీ ఆహారంలో చేర్చడం. మీరు ఆహారంలో ప్రోటీన్ , ఐరన్ చేర్చినట్లయితే, జుట్టు రాలడం సమస్యను చాలా వరకు ఆపవచ్చు. హెల్త్ షాట్స్ ప్రకారం, చాలా మంది స్త్రీలు ప్రసవించిన వెంటనే అధిక జుట్టు రాలడాన్ని అనుభవిస్తారు, ఇది ఈస్ట్రోజెన్ స్థాయిలలో తగ్గుదలకు కారణమని చెప్పవచ్చు.

**జుట్టు రాలడాన్ని తగ్గించడానికి ఈ 5 విషయాలను మీ ఆహారంలో చేర్చుకోండి:** 1. చేప- ప్రోటీన్లు, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ , విటమిన్ డి పుష్కలంగా ఉన్న చేపలను మీ ఆహారంలో చేర్చుకోండి. ట్యూనా, మాకేరెల్, సాల్మన్, హిల్సా మొదలైన చేపలు తింటే జుట్టు రాలడం తగ్గుతుంది.

2. గ్రీన్ వెజిటేబుల్స్- ఆకు కూరల్లో న్యూట్రీషియన్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి జుట్టు రాలడాన్ని నివారిస్తాయి. వీటిలో ఉండే విటమిన్ ఎ, ఐరన్, బీటా కెరోటిన్, ఫోలేట్ , విటమిన్ సి వెంట్రుకలను బలోపేతం చేయడంలో సహాయపడతాయి. ఆకు కూరల్లో విటమిన్ ఎ ఉంటుంది, ఇది జుట్టు ఆరోగ్యాన్ని కాపాడడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఇది స్కాల్ప్‌ను తేమగా ఉండేలా చేస్తుంది. జుట్టును సురక్షితంగా ఉంచుతుంది.

3. పండ్లు- విటమిన్ సి పుష్కలంగా ఉండే పండ్లు , బెర్రీలు, చెర్రీస్, నారింజ, ద్రాక్ష మొదలైన యాంటీఆక్సిడెంట్లు ఆరోగ్యకరమైన, అందమైన జుట్టుకు అవసరం. ఈ పండ్లను తీసుకోవడం వల్ల స్కాల్ప్‌ని ఫ్రీ రాడికల్స్ నుండి కాపాడుతుంది , ప్రొటీన్ జుట్టు రాలడాన్ని నివారిస్తుంది.

4. డ్రై ఫ్రూట్స్: డ్రై ఫ్రూట్స్ లో జింక్, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, సెలీనియం, విటమిన్ ఇ మొదలైన పోషకాలు పుష్కలంగా ఉంటాయి, ఇవి జుట్టును బలంగా చేస్తాయి , జుట్టు రాలడాన్ని తగ్గిస్తాయి.

5. గుడ్లు- గుడ్లు ప్రోటీన్ , గొప్ప మూలం, ఇది జుట్టు రాలడాన్ని నివారించడంలో ముఖ్యమైనది. తక్కువ ప్రోటీన్ ఆహారం జుట్టు పెరుగుదలను తగ్గిస్తుంది, ఇది జుట్టు రాలడానికి దారితీస్తుంది. ఇలాంటప్పుడు కచ్చితంగా రోజూ ఒక గుడ్డు తినాలి.

# ఉత్తరాంధ్ర ప్రజలు టీడీపీ వైపే



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): ఉత్తరాంధ్ర ప్రజలు గతంలో అభివృద్ధి పథంలో నడిపించిన తెలుగుదేశం పార్టీ వైపే ఉన్నారు అని మాజీ శాసనసభ్యులు నియోజకవర్గ టీడీపీ అనకాపల్లి నియోజకవర్గం ఇంచార్జి పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. జగన్ మోహన్ రెడ్డి ఆడుతున్న మూడు రాజధానుల ఆటను ఉత్తరాంధ్ర ప్రజలు తిప్పికొట్టారని అన్నారు.2024లో రానున్నది ఉత్తరాంధ్ర ను అభివృద్ధి చేసే తెలుగుదేశం ప్రభుత్వమే అని అన్నారు. ఎన్ని ప్రలోభాలు పెట్టినా లొంగనీ ఉత్తరాంధ్ర జిల్లాల విద్యావంతులకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. వైకాపా పార్టీ మునిగిపోయే నావ లాంటిదని అన్నారు. 2024 ఎన్నికల్లో ఇదే ఫలితాలు రాష్ట్ర మంతటా వస్తాయని అన్నారు. వైకాపా నాయకుల విశాఖ పట్టణాన్ని దోచుకోకుండా కాపాడాతామని పీలా అన్నారు అన్నారు.


## తూర్పు తీర రైల్వే

టెండర్ నం. SANDT_CAMC_23_EI_GE_03

పని పేరు: "3 (మూడు) సంవత్సరాల కాల పరిమితితో వాల్తేరు విభాగంలో 03 స్టేషన్ల వద్ద ఎలక్ట్రానిక్ ఇంటర్ లాకింగ్ సిస్టమ్స్ (G.E. MAKE) యొక్క సమగ్ర వార్షిక నిర్వహణ ఒప్పందం" ప్రాంతాలు (1) దర్లీపుట్, (2) శివలింగపురం (3) త్యాద

ప్రచార విలువ (రూ.) 37,76,139.00

బయానా (రూ.) : 75,500.00, టెండరు డాక్యుమెంట్ ధర (రూ.) : 3,540/-, పూర్తి చేయు కాలం : 36 నెలలు

బిడ్డింగ్ ప్రారంభ తేది : 20.03.2023

టెండరు ముగింపు తేది మరియు సమయం :

తేది 03.04.2023న 15.00 గం.లకు

ఈ టెండరులో మాన్యువల్ ఆఫర్లు అనుమతించబడవు మరియు అట్టి మాన్యువల్ ఆఫర్లు వచ్చినచో చెల్లనివిగా పరిగణించబడును. పై ఇ-టెండరు యొక్క పూర్తి సమాచారంతో సహా ఇ-టెండరు డాక్యుమెంట్లు కలుపుకుని వెబ్‌సైట్ https://www.ireps.gov.in లో లభిస్తుంది.

సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్ / వాల్తేరు

PR-1087/N/22-23


# 'గో బ్యాక్ సీఎం సార్'.. 'జనజాగరణ సమితి' పేరుతో విశాఖలో పోస్టర్లు




విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): 'గో బ్యాక్ సీఎం సార్', 'రాజధాని అమరావతిని నిర్మించండి' అంటూ విశాఖలో గురువారం ఉదయం పోస్టర్లు వెలిశాయి. ఆంధ్ర విశ్వవిద్యాలయంతోపాటు పలు ప్రధాన కూడళ్లలో 'జన జాగరణ సమితి' పేరుతో ఈ ఫ్లెక్సీలను తెల్లవారుజామున ఏర్పాటుచేశారు. జగదాంబ, మద్దిలపాలెం, సిరిపురం, ఆశిల్‌మెట్ట కూడళ్లలో పోస్టర్లున్న విషయం తెలుసుకున్న కొందరు వైకాపా నాయకులు వాటిని తొలగించారు. విశాఖనుంచి త్వరలో పరిపాలన కొనసాగిస్తామన్న ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఏర్పాటుచేసిన ఈ పోస్టర్లు నగరంలో కలకలం సృష్టించాయి. విశ్వవిద్యాలయ క్యాంపస్ ప్రశాంతతకు భంగం కలిగించేందుకు అవకాశమున్న ఈ పోస్టర్ల ఏర్పాటు వెనుక ఉన్నవారిని అరెస్టు చేయాలంటూ మూడో పట్టణ పోలీసుస్టేషన్‌లో ఏయూ అధికారులు ఫిర్యాదు చేశారు.

## పీఎమ్ మిత్ర మెగా టెక్స్ టైల్ పార్కులు 'మేక్ ఇన్ ఇండియా' కు మరియు 'మేక్ఫార్ ద వరల్డ్' కు ఒక గొప్ప ఉదాహరణ అవుతాయి: ప్రధాన మంత్రి

విజయవాడ, (పీఐబీ): పిఎమ్ మిత్ర మెగా టెక్స్ టైల్ పార్కుల ను తమిళ నాడు లో, తెలంగాణ లో, కర్నాటక లో, మహారాష్ట్ర లో, గుజరాత్ లో, మధ్య ప్రదేశ్ లో మరియు ఉత్తర్ ప్రదేశ్ లో ఏర్పాటు చేయడం జరుగుతుందని, అవి 5ఎఫ్ (ఫార్మ్ టు ఫైబర్ టు ఫ్యాక్టరీ టు ఫ్యాశన్ టు ఫారిన్) దృష్టికోణాని కి అనుగుణం గా వస్త్రాల రంగాని కి ప్రోత్సాహాన్ని ఇస్తాయని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు. పిఎమ్ మిత్ర మెగా టెక్స్ టైల్ పార్కులు వస్త్ర రంగాని కి అత్యాధునిక మౌలిక సదుపాయాల ను సమకూర్చి, కోట్ల కొద్దీ రూపాయల పెట్టుబడి ని ఆకట్టుకోవడం తో పాటు లక్షల కొద్దీ ఉద్యోగాల ను కూడా కల్పిస్తాయి అని ఆయన అన్నారు.

ప్రధాన మంత్రి ఒక ట్వీట్ లో -

"పిఎమ్ మిత్ర మెగా టెక్స్ టైల్ పార్కు లు 5ఎఫ్ (ఫార్మ్ టు ఫైబర్ టు ఫ్యాక్టరీ టు ఫ్యాశన్ టు ఫారిన్) దృష్టికోణాని కి అనుగుణం గా వస్త్ర రంగాని కి దన్ను గా నిలబడతాయి. తమిళ నాడు లో, తెలంగాణ లో, కర్నాటక లో, మహారాష్ట్ర లో, గుజరాత్ లో, మధ్య ప్రదేశ్ లో మరియు ఉత్తర్ ప్రదేశ్ లో పిఎమ్ మిత్ర మెగా టెక్స్ టైల్ పార్కుల ను ఏర్పాటు చేయడం జరుగుతుంది అని వెల్లడించడానికి సంతోషిస్తున్నాను."

"పిఎమ్ మిత్ర మెగా టెక్స్ టైల్ పార్కు లు వస్త్ర రంగాని కి అత్యాధునికమైనటువంటి మౌలిక సదుపాయాల ను అందిస్తాయిబీ కోట్ల కొద్దీ రూపాయల విలువైన పెట్టుబడి ని ఆకర్షిస్తాయి. దానితో పాటు లక్షల కొద్దీ కొలువుల ను సృష్టిస్తాయి. ఇది 'మేక్ ఇన్ ఇండియా' కు మరియు 'మేక్ ఫార్ ద వరల్డ్' కు ఒక గొప్ప ఉదాహరణ అవుతుంది. PragatiKaPMMitra" అని పేర్కొన్నారు.

# ఇజ్రాయిల్‌లో కొవిడ్ కొత్త వేరియంట్



సరిగ్గా మూడేళ్లవుతోంది లాక్ డౌన్ ప్రకటించి.. ఈ ఫాస్ట్ ఫార్వర్డ్ కాలంలో ఎవరూ కలలోనూ ఊహించని లాక్ డౌన్ ను నిజం చేసింది కొవిడ్ వైరస్. దీని దెబ్బకు దేశాలకు దేశాలే హడలిపోయాయి. కొన్ని దేశాలయితే సంవత్సరాల తరబడి సరిహద్దులను మూసివేశాయి. ఇప్పుడిప్పుడే ప్రపంచం నార్మల్ లైఫ్ లోకి వస్తోంది. ప్రజలు కూడా కొవిడ్ భయం నుంచి బయటపడుతున్నారు. దేశాల ఆర్థిక వ్యవస్థలు కుదుటపడుతున్నాయి. కంపెనీల నిర్వహణ కుదురుకుంటోంది.

ప్రపంచమంతా వణికింది.. కొవిడ్ తీవ్రతకు ప్రపంచం చిగురుటాకులా వణికింది. ఎంతో ఉన్నతమైన జీవన ప్రమాణాలు ఆరోగ్య వసతులు ఉండే అమెరికాలోనే 10 లక్షల మందిపైగా ప్రాణాలు కోల్పోయారు. ఇంగ్లండ్ లో ఏకంగా ప్రధానే ఐసీయూ వరకు వెళ్లొచ్చారు. భారత్ లాంటి దేశంలో తొలి విడత 2020 మార్చి నుంచి జూన్ వరకు లాక్ డౌన్ కొనసాగింది. తర్వాత అన్ లాక్ ప్రక్రియ ప్రారంభమైంది. అయితే ఇదే సమయంలో మన దేశంలో డెల్టా వైరస్ పుట్టుకొచ్చింది. తీవ్రత పరంగా అత్యంత ప్రమాదకరమై డెల్టా లక్షలాది ప్రాణాలు బలిగొంది. భారత్ లోనే డెల్టా ధాటికి 5 లక్షల మంది వరకు చనిపోయినట్లు అంచనా. ఇక ప్రపంచ వ్యాప్తంగానూ ఈ లెక్క పెద్దగానే ఉంటుందని వేరే చెప్పక్కర్లేదు.

చిన్న దేశం.. నాలుగు వేవ్ లు ప్రపంచంలోని చాలా దేశాలు రెండో మూడో కొవిడ్ వేవ్ లు చూశాయి. కానీ.. ఇజ్రాయిల్ మాత్రం నాలుగు వేవ్ లు చవిచూసింది. వాస్తవానికి ఇజ్రాయిల్ చాలా చిన్న దేశం. దాని జనాభా 95 లక్షలు. అయితే వైద్య వసతులు మెరుగు. డెవలప్ మెంట్ లోనూ ఇజ్రాయిల్ మిగతా దేశాలకు ఆదర్శం. ఇక ఇజ్రాయిల్ లో టీకా మూడు డోసులే కాక నాలుగో డోసు కూడా వేశారు. ఇదీ ఆ దేశం పరిస్థితి. అలాంటిచోట తాజాగా కొత్త వేరియంట్ పుట్టింది. బీఏ.1 బీఏ.2 వేరియంట్ల రీకాంబినెంట్. బెన్ గురియెన్ విమానాశ్రయంలో చేసిన వైద్య పరీక్షల్లో ఇద్దరు ప్రయాణికుల్లో ఈ వేరియంట్ ను గుర్తించారు. ఇప్పుడీ వేరియంట్ ఆనుపానులను గుర్తించే పనిలో ఉన్నారు శాస్త్రవేత్తలు.

ప్రమాదం కాదు.. ముప్పు లేదని చెప్పలేం కొవిడ్ లో అనేక వేరియంట్లు పుట్టకొస్తుంటాయి. వైరస్ స్వభావంలో ఇది సహజం. అయితే అన్ని వేరియంట్లూ ప్రమాదకరం కాదు. అలాగని తేలిగ్గా తీసుకోవాలని కూడా చెప్పలేం. ఉదాహరణకు చైనాలోని వూహాన్ లో పుట్టిన కొవిడ్ వేరియంట్ తొలినాళ్లలో చాలా స్ట్రాంగ్. అదే వేరియంట్ యథాతథంగా వ్యాపించి ఉంటే చాలా ప్రమాదం జరిగేది. కానీ కాస్త బలహీనపడి వ్యాపించింది. మరోవైపు భారత్ లో పుట్టిన డెల్టా అత్యంత డేంజర్ అయితే వ్యాప్తి వేగం తక్కువ. ఇక దక్షిణాఫ్రికాలో పుట్టిన ఒమైక్రాన్ వ్యాప్తి వేగం ఎక్కువ. కానీ తీవ్రత తక్కువ. కాగా ఒమైక్రాన్ వచ్చి ఏడాదిపైగా అవుతోంది. ఆ తర్వాత మళ్లీ ఏ వేరియంట్ గురించి కూడా ప్రముఖంగా ప్రమాదకరమని వార్తలు రాలేదు.

# దైవాన్ని కోరిక ఎలా కోరాలి ?



1. నువ్వు బతికి ఉన్నంత కాలం ధార్మిక కార్యాలు నీ సంపదతో చేయాలి అని కోరుకోవాలి, అంటే ఎప్పుడూ నువ్వు ఇచ్చే స్థితిలో ఉండాలి అని అర్థం అంటే ఎప్పటికీ నీకు సంపాదన ఉంటుంది.

2. నా ఇంట్లో దైవానికి నిత్య నైవేద్యం ఉండాలి అని కోరుకోవాలి అంటే నీ ఇంట్లో ధాన్యం ఎప్పుడూ నిలువ ఉంటుంది.

3. నా ఇంట్లో నేను నిత్య పూజ రోజు చేయాలి అని కోరుకోవాలి అంటే నీ ఆరోగ్యం బాగుంటే నువ్వు ఎప్పుడూ ఆనందంగా ఉంటే నీ ఇంట్లో నిత్య పూజ చేస్తావు.

4. నా ఇంటికి ఎవ్వరు వచ్చినా కడుపునిండా భోజనం చేసి వెళ్ళాలి అని కోరుకోవాలి అంటే నీకు అనుకూల వతి అయిన ధర్మపత్ని భాగస్వామి అవుతుంది.

5. నేను నా చివరి దశ వరకు నీ క్షేత్రానికి దర్శనానికి రావాలి అంటే నీకు సంపూర్ణ మైన ఆరోగ్యాన్ని ఇవ్వమని అడగటం.

6. భాగవతులతో నీ గడప నిండుగా ఉండాలి అని కోరుకోవాలి అంటే నీకు సమాజంలో తగిన గౌరవం మంచి పేరు రావాలి అని కోరుకోవడం.

7. కుటుంబం అంతా సంతోషం గా క్షేత్ర దర్శనము నకు రావాలి అని కోరాలి అంటే నువ్వు ఆరోగ్యంగా, ఆర్థికంగా, కుటుంబం తో అన్యోన్యంగా ఉంటేనే జరుగుతుంది. ఇంక ఏమి కావాలి జీవితానికి.

8. చివరిగా నేను పండు ముత్తైదువుగా సంతోషంగా కాలం చేయాలి అని కోరుకోవాలి అంటే భర్తకు సంపూర్ణ ఆయువు ఆరోగ్యం కోరుకోవడం.

మనకు తల్లిదండ్రులు ఆ దైవమే కదా! వారిని కాక ఇంక ఎవరిని అడుగుతాము.

కావున ఆ అడిగే కోరిక ఇలా ఉంటే ఆ దైవం కూడా త్వరగా అనుగ్రహిస్తాడు అని పెద్దల సూచన.

# ఏడాదిలో 28 మంది.. అధికారుల నిర్లక్ష్యానికి సామాన్యులే బలి?



ప్రమాదాలు జరిగినప్పుడు హడావుడి చేసే ప్రజాప్రతినిధులు అధికారులు ఆ తర్వాత పట్టించుకోవడం లేదు. తూతూమంత్రంగా చర్యలు చేపట్టి దులుపుకుంటున్నారు. అభాగ్యుల ఉసురు తీస్తున్నా రక్షణ చర్యలు కరువవుతున్నాయి.

కాలాలు ఏవైనా సరే.. సికింద్రా 'బాధ' మాత్రం పోవడం లేదు. ఇక్కడ నిర్లక్ష్యమో లేక ప్రమాదమో తెలియడం లేదు కానీ వరుసగా అగ్ని ప్రమాదాలు కలకలం రేపుతున్నాయి. ఇప్పటికే సికింద్రబాద్ క్లబ్ మంటల్లో అప్పట్లో కాలిపోయింది. అ తర్వాత కూడా ఈ అగ్ని ప్రమాదాలు హైదరాబాద్ ను వీడడం లేదు.

ఏడాది కాలంలో సికింద్రాబాద్ పరిధిలో జరిగిన 4 అగ్ని ప్రమాదాల్లో 28 మంది మరణించారు. మార్చి 23న టింబర్ డిపోలో 11 మంది సెప్టెంబరు 12న రూబీ లాడ్జిలో 8మంది జనవరి 29న డెక్కన్ మాల్ లో ముగ్గురు తాజాగా స్వప్నలోక్ లో ఆరుగురు చనిపోయారు.

భారీ అగ్ని ప్రమాదం బతుకు దెరువు కోసం ఆ కాంప్లెక్స్ లో పనిచేస్తున్న ఆరుగురు ప్రాణాలను తీసింది. నిండా పతికేళ్ల కూడా లేని వారి జీవితాలను అర్థాంతరంగా ముగించింది. పని కోసం పట్నం వెళ్లిన తన బిడ్డలు ఎప్పుడు వస్తారని ఎదురుచూసిన తల్లిదండ్రులకు తీరని శోకం మిగిలింది.

స్వప్నలోక్ లో భారీ అగ్ని ప్రమాదంలో ఆరుగురిని పొట్టనపెట్టుకుంది. అతికష్టం మీద గ్రిల్స్ తొలగించి అయిదో అంతస్తులోకి వెళ్లిన అగ్ని మాపక శాఖ అధికారులు అపస్మారక స్థితిలో ఉన్న ఐదుగురిని బయటకు తీసుకొచ్చారు. వీరికి సీపీఆర్ చేసి ఆస్పత్రికి తరలించారు. వీరు అప్పటికే మృతి చెందినట్టు గాంధీ ఆస్పత్రి వైద్యులు ప్రకటించారు. ఈ ఆరుగురికి కాలిన గాయాలు లేవు. ఊపిరితిత్తుల్లో పొగ చేరడంతోనే చనిపోయారని వైద్యులు తెలిపారు.

ఇన్ని ప్రమాదాలు జరుగుతున్నా జీహెచ్ఎంసీ కఠిన చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. యజమానులు అధికారుల నిర్లక్ష్యానికి సామాన్యులు బుగ్గికావాలా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

# టీచర్ల అంచనాలు తిరగబడ్డాయా ?



ఇపుడీ విషయమే అందరిలోను హాట్ టాపిక్ అయిపోయింది. పట్టభద్రులు టీచర్ల కోటాలో భర్తీ అవ్వాల్సిన ఐదు ఎంఎల్సీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. దాని ఫలితాలే ఇపుడు వస్తున్నాయి. కొన్ని నియోజకవర్గాల్లో ఇంకా ఓట్ల లెక్కింపు జరుగుతుంటే రెండు నియోజకవర్గాల్లో ఫలితాలు ప్రకటించారు. పోలింగ్ కు ముందు తర్వాత కూడా అందరిలోను జనరల్ గా వినిపించిన మాటేమిటంటే రెండు టీచర్ల నియోజకవర్గాలకు జరిగిన ఎన్నికల్లో వైసీపీ ఓటమి ఖాయమని.

కానీ జరిగిందే ఏమిటంటే పూర్తి రివర్సు. నెల్లూరు-చిత్తూరు-ప్రకాశం జిల్లాల టీచర్ల నియోజకవర్గానికి జరిగిన ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి పర్వతనేని చంద్రశేఖరరెడ్డి గెలిచారు. ఈయన పీడీఎఫ్ అభ్యర్థి బాబురెడ్డిపై మంచి మెజారిటితో గెలిచారు. స్వతహాగానే మంచిపేరున్న పర్వతనేని మొదటినుండి గెలుస్తాడని అనుకుంటునే ఉన్నారు.

అయితే ఓట్లేయాల్సింది టీచర్లే కాబట్టి గెలుపు గ్యారెంటీ లేదనే టాక్ కూడా వినబడింది. పీఆర్సీ బకాయిలు జీతాల చెల్లింపులో ఆలస్యం తదితర కారణాలతో టీచర్లంతా ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారనే ప్రచారం అందరికీ తెలిసిందే.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉపాధ్యాయులు చేసిన ఉద్యమాలు అందరికీ తెలిసిందే. కాబట్టి టీచర్ల నియోజకవర్గాల్లో వైసీపీ అభ్యర్ధుల గెలుపుపై ఉత్కంఠ పెరిగిపోయింది. తీరా ఫలితాలు చూసిన తర్వాత అందరు ఆశ్చర్యపోయారు. అలాటే పశ్చిమ రాయలసీమ నియోజకవర్గం నుండి ఎంవీ రామచంద్రారెడ్డి పోటీచేశారు. ఈయన పీడీఎఫ్ అభ్యర్థి ఒంటేరు శ్రీనివాసులరెడ్డిపై 165 ఓట్ల మెజారిటీతో గెలిచారు.

రెండు టీచర్ల నియోజకవర్గాల ఎన్నికల్లో రెండింటిలోను వైసీపీ ఓడిపోతుందని టీడీపీ బీజేపీ పీడీఎఫ్ జనసేన నేతలు పెద్దఎత్తున ప్రచారం చేశారు. తీరా ఫలితాలు చూస్తే రెండింటిలోను వైసీపీ అభ్యర్థులే గెలిచారు. మరి ప్రచారం జరిగినట్లు టీచర్లలో ప్రభుత్వంపై అంతగా ఆగ్రహం లేదా ? లేదా అనే అనుమానాలు పెరిగిపోతున్నాయి.

లేకపోతే అభ్యర్థులు మ్యానేజ్ చేసుకున్నారా ? బలమైన అభ్యర్థులను వైసీపీ ముందుగానే ప్రకటించింది. పైగా ఇద్దరు కూడా ప్రైవేటు స్కూల్ నడుపుతున్నవారే. అదీకాకుండా ఇద్దరికీ టీచర్లందరితోను మంచి సంబంధాలున్నట్లు సమాచారం. కారణాలు ఏవైనా ఓడిపోతారని అనుకున్న టీచర్ల నియోజకవర్గాల్లో వైసీపీ గెలవటమే ఆశ్చర్యంగా ఉంది.

## 100 కంటే ఎక్కువ జిల్లాలను అభివృద్ధిపరచడానికి అర్థికమంత్రిత్వశాఖ పర్యటన

విజయవాడ, (పీఐబీ): భారతదేశం అంతటా 100 కంటే ఎక్కువ జిల్లాలను అభివృద్ధిపరచడానికి ఆశావహ జిల్లాల కార్యక్రమం ప్రభుత్వం ప్రారంభించింది.

ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లోని ఆస్పిరేషనల్ డిస్ట్రిక్ట్స్ గా ఎంపికైన ఆశావహ జిల్లాల నుంచి 68 మంది షెడ్యూల్ కులాల, తెగలకు చెందిన ప్రతిభావంతులైన ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల బృందం మార్చి 16-17 నుంచి 'ఎడ్యుకేషనల్ కమ్ ఫైనాన్షియల్ లిటరసీ' టూర్‌లో రాజధాని నగరం న్యూ ఢిల్లీని సందర్శిస్తున్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్.

మార్గదర్శకత్వంలో ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ పర్యటన ఏర్పాటు చేసింది.

39 మంది బాలురు, 29 మంది బాలికలతో కూడిన బృందంలో విద్యార్థులతోపాటు, వారి ఉపాధ్యాయులు పాల్గొంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని మూడు ఆకాంక్షాత్మక జిల్లాలు గా ఎంపికైన విజయనగరం, విశాఖపట్నం మరియు వైఎస్ఆర్ కడప జిల్లాలకు చెందినవారితోపాటు తమిళనాడులోని విరుదుంగర్ రామనాథపురం అనే రెండు ఆకాంక్షాత్మక జిల్లాల వారూ పాల్గొంటున్నారు. వారంతా ప్రస్తుతం దేశ రాజధాని పర్యటనలో ఉన్నారు.

పర్యటన సందర్భంగా, విద్యార్థులు గౌరవనీయులైన ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సంభాషించారు పార్లమెంటుభవనాన్ని, ప్రధాన మంత్రి సంగ్రహాలయాన్ని ఇండియా గేట్‌లను సందర్శించారు.

విద్యార్థులు నోయిడాలోని భారత ప్రభుత్వ నాణాల ముద్రణా టంకశాల ను కూడా సందర్శిస్తారు. శుక్రవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహనా కార్యక్రమానికి హాజరవుతారు.

పార్లమెంట్ సందర్శన, ప్రధానమంత్రి సంగ్రహాలయ సందర్శన చరిత్ర రాజనీతి సంగ్రహావలోకనం కలిగించే అంశాలు, అయితే ఆర్థిక అక్షరాస్యతపై కార్యక్రమం, భారత ప్రభుత్వ నాణాల ముద్రణాశాల- మింట్‌ను సందర్శించడం ద్వారా వివిధ ఆర్థిక అంశాల గురించి అవగాహన లభిస్తుంది.

జనవరి 2018లో గౌరవనీయులైన భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రారంభించిన ఆశావహ జిల్లాల కార్యక్రమం దేశవ్యాప్తంగా 100 కంటే ఎక్కువ జిల్లాలను అభివృద్ధి దిశగా సమర్థవంతంగా మార్చడం లక్ష్యంగా ప్రారంభించారు.

# రైతుల సంక్షేమానికి ఈ-క్రాప్, ఈ-కేవైసీ



కాకినాడ, (విశాఖ సమాచారమ్): పెట్టుబడి రాయితీ, సున్నావడ్డీ, పంట బీమా, ధాన్యానికి మద్దతు ధర పొందడం తదితరాల కోసం ఈ-క్రాప్, ఈ-కేవైసీ తప్పనిసరి అని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. శుక్రవారం కాకినాడ కలెక్టరేట్ స్పందనహాల్లో జిల్లా వ్యవసాయ సలహా మండలి (ఏఏబీ) సమావేశం జరిగింది. ఈ సమావేశానికి వ్యవసాయ, పశు సంవర్ధక, ఉద్యాన, పట్టు, నీటి పారుదల, డ్రైనేజ్, విద్యుత్ తదితర శాఖల అధికారులు, రైతులు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు జీవీ పద్మశ్రీ, ఎ.గాయత్రీదేవి ప్రస్తుతం జిల్లాలో వ్యవసాయ కార్యకలాపాలను వివరించారు. పంట నమోదుకు సంబంధించిన జాబితాలు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని.. ఏవైనా సమస్యలు ఉంటే రైతులు సరిచేయించుకోవచ్చన్నారు. 90 శాతం ఈ-కేవైసీ పూర్తయిందని తెలిపారు. వ్యవసాయ అధికారులు, సిబ్బంది సూచనల మేరకు హేతుబద్ధంగా యూరియాను వినియోగించాలన్నారు. వ్యక్తిగతంగానూ వ్యవసాయ పరికరాల పంపిణీకి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని.. ముందుగా స్ప్రేయర్లు, టార్పాలిన్లు అందిస్తున్నట్లు తెలిపారు. ఆర్బీకేల్లో రబీకి అవసరమైన ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

**వ్యవసాయ అధికారుల సూచనలు:**

రబీ కోతలు మార్చి 31 నాటికి పూర్తయితే రైతులు తర్వాత అపరాలు వేసుకోవాలి.

డ్రోన్లతో 5 నిమిషాల్లో ఎకరం పొలంలో స్ప్రే చేయవచ్చు. డ్రోన్ పైలట్ శిక్షణకు పాస్పోర్ట్ తప్పనిసరి. రైతులు శిక్షణకు ముందుకు రావాలి. బీఎస్సీ (అగ్రి) అభ్యర్థులకు 50%, మిగిలిన వారికి 40% సబ్సిడీపై డ్రోన్లను సరఫరా చేస్తారు. సీసీఆర్సీ కార్డులపై రైతులకు క్షేత్రస్థాయి సిబ్బంది, వ్యవసాయ సలహా మండళ్ల సభ్యులు అవగాహన కల్పించాలి.

# స్పందనలో 12 ఫిర్యాదులు



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ పరిధిలో ఎనిమిది జోన్ల లో ఉన్న పట్టణ ప్రణాళిక విభాగపు "స్పందన"లో అధికంగా ఫిర్యాదులు వస్తున్న దృష్ట్యా కమిషనర్ పి రాజాబాబు ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం ప్రధాన కార్యాలయంలో నిర్వహించే "స్పందన" కార్యక్రమం పట్టణ ప్రణాళిక అధికారి బి సురేష్ కుమార్ ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రణాళిక అధికారి మాట్లాడుతూ పట్టణ ప్రణాళిక విభాగపు "స్పందన" కార్యక్రమంలో ఒకటవ జోన్ - 1, రెండవ జోన్ - 1, నాలుగవ జోన్ - 1, ఐదువ జోన్- 3, ఆరవ జోన్-4, ఎనిమిదవ జోన్ - 2, మొత్తం 12 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. జివిఎంసి పరిధిలో ఎలాంటి అనధికార నిర్మాణాలు, నిబంధనలు ఉల్లంఘించి భవనాలు నిర్మించినా, భవన నిర్మాణ వ్యర్థాలు వేసినా ప్రత్యేక టోల్ ఫ్రీ నెంబర్ 1800 4250 0009 మరియు మొబైల్ వాట్సాప్ నెంబర్ 81878 97569 కు ప్రతిరోజు నేరుగా ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. ప్రతి శుక్రవారం నిర్వహించే "స్పందన"లోని ఫిర్యాదులను దిగువ స్థాయి సిబ్బంది నుండి పై అధికారి వరకు వివరణ అడిగి ఫిర్యాదులు పరిష్కారం అయ్యే విధంగా చూస్తామన్నారు.

ఈ "స్పందన" కార్యక్రమంలో డిసిపి లు నరెంద్రనాద్ రెడ్డి, కె పద్మజ, రత్నాకర్, ఏసీపిలు శ్రీనివాస్, వెంకటేశ్వర రావు, వినయ్ ప్రసాద్, అరుణ వల్లి, రమణ మూర్తి, సుభాన్ శాస్త్రి, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# 19న తల్లుల ఖాతాల్లోకి నగదు జమ

చదువుకు పేదరికం అడ్డు కాకూడదు. అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి జగన్ పేద విద్యార్థుల కోసం విద్యా దీవెన పథకం ప్రారంభించారు. పేద విద్యార్థుల చదువుకు ఎంత ఖర్చు అయినా భరిస్తామని జగన్ నాడు పాదయాత్ర సమయంలోనే హామీ ఇచ్చారు. ఆ హామీకి అనుగుణంగా జగనన్న విద్యా దీవెన పథకం కింద అర్హులైన పేద విద్యార్థులందరికీ ప్రభుత్వం పూర్తి స్థాయి ఫీజు రీయింబర్స్‌మెంట్ అందజేస్తుంది. మలి విడత జగనన్న విద్యా దీవెన నిధులు ఈ నెల 19న ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో సీఎం జగన్ విడుదల చేయనున్నారు.

ఈ నెల 19న విద్యా దీవెన నిధుల విడుదల 2019 నవంబర్ లో ఈ పథకాన్ని పేద విద్యార్థుల కోసం అందుబాటులోకి తీసుకొచ్చారు. విద్యార్థులు తమ కళాశాలలకు కట్టాల్సిన ఫీజులను మూడు నెలలకు ఒకసారి విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేస్తోంది. 10.82 లక్షల మంది విద్యార్థులకు ఈ పథకం ద్వారా ప్రయోజనం అందుతోంది. ఈ ఏడాది 2023-24 వార్షిక బడ్జెట్ లో ఈ పథకం కోసం రూ 2841 కోట్లు ఏపీ ప్రభుత్వం కేటాయించింది. స్టూడెంట్స్ కళాశాలలకు కట్టాల్సిన పూర్తి ఫీజుల మొత్తాన్ని.. ఏ త్రైమాసికానికి ఆ



త్రైమాసికం ముగిసిన వెంటనే స్టూడెంట్స్ తల్లుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తోంది ప్రభుత్వం. ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చదివే పేద విద్యార్థులు కాలేజీలకు చెల్లించాల్సిన పూర్తి ఫీజుల మొత్తాన్ని తల్లుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తోంది.

అర్హులైన ప్రతీ విద్యార్థికి అండగా జగనన్న విద్యా దీవెన కింద ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా అర్హులైన పేద విద్యార్థులందరికీ పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ అందిస్తున్నారు. ఇదే సమయంలో విదేశాల్లో చదువుకోవాలని కోరుకునే పేద విద్యార్థులకు జగనన్న విదేశీ విద్యా దీవెన ద్వారా జగన్ ప్రభుత్వం అండగా నిలుస్తోంది.ఎలాంటి కోటాలు లేకుండా అర్హులైన విద్యార్థులందరికీ సంతృప్త స్థాయిలో జగనన్న విదేశీ విద్యా దీవెన అందిస్తున్నారు. అంతేకాదు పూర్ స్టూడెంట్స్ భోజనం, వసతి ఖర్చుల కోసం ఇబ్బంది పడకుండా చేస్తోంది సీఎం జగన్ క్రమం తప్పకుండా వీరికి ఆర్థికంగా తోడ్పాటును అందిస్తు అండగా నిలుస్తున్నారు. ఈ పథకం ద్వారాటాప్ 100 విశ్వవిద్యాలయాల్లో ప్రవేశం పొందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు గరిష్ఠంగా రూ.1.25 కోట్ల వరకు, మిగిలిన వారికి గరిష్ఠంగా రూ.కోటి వరకు 100 శాతం ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్ అందుతోంది.

విదేశీ విద్యకు ప్రోత్సాహం 100 - 200 క్యూఎస్ ర్యాంకింగ్ యూనివర్సిటీల్లో సీట్లు పొందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు 100శాతం ట్యూషన్ ఫీజు గరిష్ఠంగా రూ.75 లక్షల వరకు రీయింబర్స్‌మెంట్ చేయాలని నిర్ణయించారు. మిగిలిన విద్యార్థులకు గరిష్ఠంగా రూ.50 లక్షలు లేదా ట్యూషన్ ఫీజులో 50 శాతం ఏది తక్కువైతే అది చెల్లిస్తారు. విదేశీ విశ్వవిద్యాలయాలకు వెళ్లే విద్యార్థులకు విమాన, వీసా చార్జీలను సైతం ప్రభుత్వం రీయింబర్స్ చేస్తోంది. జగనన్న వసతి దీవెన స్కీమ్ కింద ఏటా 2 వాయిదాల్లో ఇంజనీరింగ్, మెడిసిన్, డిగ్రీ ఇతర కోర్సులు చేసేవారికి రూ.20 వేలు అందజేస్తోంది. అలాగే ఐటీఐ స్టూడెంట్స్‌కు రూ.10 వేలు, పాలిటెక్నిక్ స్టూడెంట్స్‌కు రూ.15 వేలు ఇస్తుంది. చదువు పైన చేసే ఖర్చు రేపటి అభివృద్ధికి పెట్టుబడిగా జగన్ ప్రభుత్వం బాధ్యత తీసుకుంటోంది.

# ఏయూలో 'రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ సివిల్ ఇంజనీరింగ్' సదస్సు



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): ఆంధ్రవిశ్వవిద్యాలయం సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో 'రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ సివిల్ ఇంజనీరింగ్' అంశంపై ఒక రోజు సదస్సును నిర్వహించారు. విభాగాధిపతి ఆచార్య సి.ఎస్.వి సత్యనారాయణ రెడ్డి అధ్యక్షత వహించి సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తీర ప్రాంతాలలో వైవిధ్యమైన వాతావరణ పరిస్థితులు ఉంటాయని వీటిని తట్టుకునే నిర్మాణాలు జరపాలన్నారు. సాగర్ సిమెంట్స్ సీనియర్ మేనేజర్(టెక్నికల్ సర్వీసెస్) జనార్ధన్ అరుణాచలం కీలకోపన్యాసం అందించారు. విభిన్న వాతావరణ పరిస్థులకు అనుణంగా సిమెంట్ నిర్మాణాలు, తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. ఐఐటి మద్రాస్ సివిల్ ఇంజనీరింగ్ పూర్వ ఆచార్యులు కె.రాజ గోపాల్ జియో సింథసిటిక్ మెటీరియల్‌తో నిర్మించిన కన్నూర్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణాన్ని వివరించారు. గర్‌వారి వాల్ ఫైబర్ లిమిటెడ్(పూణే) ప్రతినిధి రమేష్ చెట్టి రాక్‌ఫాల్ ప్రొటక్షన్, స్టెప్‌హిల్ స్లోప్స్ అంశంపై వివిధ ఉదాహరణలో వివరించారు. కెల్లెర్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ వై.హరి కృష్ణ సస్టైనబుల్ ఫౌండేషన్ టెక్నాలజీ అంశంపై ప్రసంగించారు. సదస్సుకు విభాగ ఆచార్యులు డాక్టర్ ఐ.శివ పార్వతి కన్వీనర్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలోవిభాగ పరిశోధకులు, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా అనకాపల్లి శ్రీ నూకంబిక అమ్మవారి ఊరేగింపు





అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): ప్రముఖ పుణ్యక్షేత్రం అనకాపల్లి శ్రీ నూకంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర మహెూత్సవంలో భాగంగా శ్రీ నూకంబిక అమ్మవారి మాలధారల సేవ సంఘం అధ్యక్షుడు పాలిమేర శ్రీను ఆధ్వర్యంలో శుక్రవారం అంగరంగ వైభవంగా అమ్మవారి ఉత్సవమూర్తుల ఊరేగింపు కార్యక్రమం జరిగింది.108 ఘటాలుతో నూకాంబిక అమ్మ వారి మాలధారణ భక్తులు ఊరేగింపులో పాల్గొన్నారు. కొంతమంది భక్తులు బాగా శూలాలు వేసుకుని అమ్మవారి పట్ల తమ భక్తి ప్రపత్తులను చాటుకుంటూ ఊరేగింపులో పాల్గొన్నారు. ఊరేగింపు రథంలో అమ్మవారు ఉత్సవ మూర్తిని ప్రత్యేక అలంకారం చేసి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం, జిల్లా ఖో ఖో సంఘం అధ్యక్షులు దాడి జయవీర్ రథోత్సవం ప్రారంభించారు. ఈ ఊరేగింపులో వివిధ రకాల నేలవేషాలతో అత్యంత ఘనంగా జరిగింది. ఈ ఊరేగింపులో 20 నేల వేషాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు. చోటుచేసుకున్నాయి. తెలంగాణ కళాకారులు చే పొట్టి పోతురాజు విన్యాసాలు, కేరళ కళాకారుల వాయిద్యాలు, రాజమండ్రి కళాకారులు చే అమ్మవారి వేషాలు, విజయనగరం కళాకారుచే పులి వేషాలు, కోలాటంలు, చిడతలు, తప్పెడు గుళ్ళు ,పేనుకేరు కళాకారుచే గారడి, ఒరిస్సా కళాకారుల జై గంటలు వంటి జానపద కళారీత్తులు పాల్గొన్నాయి., ఈ కార్యక్రమంలో. జిల్లా దేవాదాయ శాఖ అధికారి బుద్ధ మహాలక్ష్మి నగేష్,శతకం పట్టు కనకదుర్గ అమ్మవారి ఆలయ వ్యవస్థాపకులు పివి రమణ, కార్పొరేటర్లు. కొణతాల నీలిమ భాస్కర్,పీలా లక్ష్మి సౌజన్య రాంబాబు, సూరిశెట్టి హృదయ్, కోలపర్తి శ్రీను, మళ్ల గణేష్, అక్షయ్ రాజు ,పవన్ ,కృపా సాగర్, కొండ, భక్తులు పాల్గొన్నారు. అమ్మవారి ఊరేగింపు నూకాంబిక అమ్మవారి ఆలయం నుండి ప్రారంభమై పట్టణ పురవీధులలో సాగి తిరిగి ఆలయానికి చేరుకుంటుంది. కొత్త మాస జాతర మహెూత్సవాల్లో భాగంగా మధ్యాహ్నం నూకాంబిక మాలధారణ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు.

# నేడు రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు రుద్రరాజు ఢిల్లీ పయనం



అరకులోయ, (విశాఖ సమాచారమ్): ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు శనివారం ఉదయం విశాఖపట్నం విమానాశ్రయం నుండి ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్. పోర్ట్ న్యూఢిల్లీ. ప్రయాణము చేయుచున్నారు భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయానికి శనివారం భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ మల్లికార్జున ఖర్గే. ఆల్ ఇండియా ఆదివాసి కాంగ్రెస్ పార్టీ చైర్మన్ శ్రీ .శివాజీ రావ్ మోగే. మరియు భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ. ఎస్టీ. బీసీ. మరియు మైనారిటీ జాతీయ సమన్వయకర్త కొప్పుల రాజు ఈ విస్తృత స్థాయి సమావేశానికి ఆల్ ఇండియా ఆదివాసి కాంగ్రెస్.పార్టీ. జాతీయ సదస్సు 29 రాష్ట్రాల ఎస్టీ విభాగం చైర్మన్‌లతో దేశంలో ఉన్న గిరిజనుల. హక్కులు చట్టాలు చర్చించడం కోసం కాంగ్రెస్ పార్టీ ద్వారా భారీ ఎత్తున సమావేశం జరుగుతుంది ఈ సమావేశానికి అరకు వేలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పాచి పెంట శాంతకుమారి హాజరగుచున్నారు.

# పైడా క్రిష్ణప్రసాద్ ఏజ్ కేర్ ఫౌండేషన్‌కు 10 లక్షలు విరాళం



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): శుక్రవారం గంభీరంలోని స్నేహ సంధ్య ఏజ్ కేర్ ఫౌండేషన్ సి - బ్లాక్ ,3వ స్లాబ్‌కు పూజలు నిర్వహించగా, నేటి ఉదయం మార్చి 1వ తేదీ బుధవారం ఉదయం 7.30 గంటలకు ఆంధ్ర ప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షులు పైడా క్రిష్ణప్రసాద్ కాంక్రీట్ పోసి ప్రారంభించారు.

వయో వృద్ధుల సంరక్షణ సౌకర్యాల నిర్మాణానికి అతను 10 లక్షలు విరాళంగా అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఏజ్ కేర్ ఫౌండేషన్ చైర్మెన్ జి.సాంబశివరావు, ఏజ్ కేర్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టు ఎన్.ఎస్.రాజు, మరియు కమిటీ సభ్యులు ఓ.నరేష్ కుమార్, డి ఎస్ వర్మ లు పాల్గొన్నారు.


WANTED DISTRIBUTERS

Fitearly



A food supplement powder to drink with milk to regain Energy. Purely without sugar and Very Very Tasty.

IQ Up-HG



A food supplement for school and college going GIRLS to Improve Memory power, Growth, balance Harmones and keep ENERGYTIC.

IQ Up-HB



An interesting and tasty food supplement for school and college going boys to improve concentration on study, sports, memory, IQ, fitness and keeps always ENERGYTIC.

These Three products are manufactured by shri Akella Subrahmanya Sharma, M.D., Herbindo pvt.ltd. Hyderabad.

* Marketing and Business promotion Support is offered for Distributors.

Minimum Investment :

Rs. 25,000/- Only

Atractive profits and lagre Sales assured.

Contact : 9393949345
S.V.Rao, Visakhapatnam



మెగా బ్రాహ్మణ వివాహ వేదిక

తెలుగు బ్రాహ్మణ వధూవరుల

వివాహ పరిచయ కార్యక్రమం

విశాఖ సమాచారమ్ దినపత్రిక కార్యాలయం

9-3-16, పిఠాపురం కోలనీ, (కృష్ణా కాలేజ్ జంక్షన్, మెయిన్‌రోడ్డు) విశాఖపట్నం-530003



తేది : 26-03-2023, (ఆదివారం)

సమయం : మధ్యాహ్నం గం. 2.00 ల నుండి సాయంత్రం గం. 5.00 వరకు.

శ్రీకాకుళం నుండి విజయవాడ వరకు,
హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, చెన్నై,
బెంగుళూరు, పూణే వంటి ప్రముఖ
నగరాలలో పనిచేస్తున్న సుమారు
500 మంది వధూవరుల వివరములతో...

రిజిస్ట్రేషన్ మరియు వివరముల కొరకు :

9393949345, 8074541283



VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16,Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345,
Visakhapatnam : Cell : 9346314199, Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 7013118088, Simhachalam : Cell: 96660 15921,
Paravaada : Cell: 77804 33919, Aarilova : Cell: 97050 51389, Cheedikaada : Cell: 97686 33999, Gaajuwaaka : Cell: 70139 78488